నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నేటి కందం- నేటికి అందం**

మన్నికగల రహదారుల
నెన్నో నిర్మించినట్టి యెన్ హెచ్ యే యై
మిన్నగ పలువురు పొగడగ
గిన్నీసు రికార్డు పొందె కృషి ఫలితముగన్!!

(రహదారుల నిర్మాణంలో భారత జాతీయ ప్రధాన రహదారుల ప్రాధికార సంస్థ (యన్ హెచ్ యే యై) తక్కువ సమయంలో ఎక్కువ పొడవైన రోడ్డు నిర్మించి గిన్నిస్ వరల్డ్ రికార్డును నెలకొల్పింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

చురక

జాతి మతం విద్వేషం
జరిగే పలు నేరాలు
విస్తరిస్తే బాధ్యులెవరు
వివక్షల ఘోరాలు.
రాజకీయ అధికారం
రక్షణలో దాని జోరు
కంచే చేను మేస్తుంటే
కట్టడింకా బేజారు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 9-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:126 పేజీలు:6 వెల: రూ.1/-

## ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర: సీఎం రేవంత్



హైదరాబాద్, జనవరి 8: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, దేశవ్యాప్తంగా దీనికి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం నాడు గాంధీభవన్‌లో పీసీసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉందని.. వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభమవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ-అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు.

ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవా డు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చినవారేనని, పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో పట్టుబడ్డ రూ.1.2 కోట్ల విలువైన చైనా మాంజా

**-143 మందిపై పాటు కేసులు నమోదు: హైదరాబాద్ సిపి సజ్జనార్**

హైదరాబాద్ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: చైనా మాంజాపై కేంద్రం నిషేధం విధించిందని హైదరాబాద్ సిపి సజ్జనార్ తెలిపారు. కొన్ని ఈ కామర్స్ సైట్లకు నోటీసులు ఇచ్చామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాటాడుతూ.. అక్రమంగా నిల్వ చేసి చైనా మాంజాను విక్రయిస్తున్నారని, చైనా మాంజాకు గాజు పెంకులు, మెటలిక్ కోటింగ్ చేస్తారని తెలియజేశారు. గోల్కొండ, చార్మినార్ జోన్ల పరిధిలో భారీగా మాంజా స్వాధీనం చేశామని సజ్జనార్ పేర్కొన్నారు. హైదరాబాద్ లో భారీగా చైనా మాంజా పట్టుకున్నామని, రూ.1.2 కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నామన్నారు. చైనా మాంజా అమ్ముతున్న 143 మందిపై నమోదు చేయడంతో పాటు కేసులు నమోదు చేశామన్నారు. ఢిల్లీ, సూరత్, మహారాష్ట్ర నుంచి చైనా మాంజాను తీసుకొచ్చి హైదరాబాద్ లో అమ్ముతున్నారని తెలిపారు.

## సీఎం రేవంత్‌తో హిమాచల్ ప్రదేశ్ మంత్రి భేటీ.. విద్యా విధానంపై ఆరా..

హైదరాబాద్, జనవరి 8: ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే ప్రీ ప్రైమరీ విద్యా విధానాన్ని త్వరలో తెలంగాణలో అమలు చేయనున్నట్లు హిమాచల్‌ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్ కుమార్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యాన్ని సైతం కల్పించే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆయనకు రేవంత్ రెడ్డి వివరించారు.



తెలంగాణ సచివాలయంలో ఇవాళ(గురువారం) సీఎం రేవంత్ రెడ్డిని హిమాచల్‌ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ కుమార్‌తో కూడిన ఉన్నతాధికారుల బృందం కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న విద్యా విధానాన్ని సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి రోహిత్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిదుతున్నట్లు ఈ సందర్భంగా సీఎం రేవంత్ వివరించారు.

ప్రతి నియోజకవర్గంలో ఏటీసీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మల్లెపల్లిలోని ఐటీఐని సందర్శించాలని మంత్రి రోహిత్ కుమార్‌కు ముఖ్యమంత్రి సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలు కానున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపై రోహిత్ కుమార్ ఆసక్తి కనబరిచారు.

ఈ స్కూళ్ల ఏర్పాటుకు సంబంధించి.. సమగ్ర నివేదికను తమకు అందించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ను హిమాచల్ ప్రదేశ్ మంత్రి కోరారు. అలాగే ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు రేవంత్ రెడ్డి విజన్‌ను రోహిత్ కుమార్ అభినందనలతో ముంచెత్తారు.

రాష్ట్ర విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు వివరాలను హిమాచల్‌ప్రదేశ్ మంత్రికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ వివరించారు. 25 ఎకరాల సువిశాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకే చోట మినీ యూనివర్సిటీ తరహాలో రూ200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు సోదాహరణతో రోహిత్ కుమార్‌కు ముఖ్యమంత్రి వివరించారు.

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో త్వరలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురానున్నట్లు ఆయనకు సీఎం రేవంత్ వివరించారు. అందుకు సంబంధించి ఒక కమిటీని నియమించామని.. త్వరలోనే పాలసీని తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డితోపాటు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బిఎం బిర్లా సైన్స్ సమాజం కోసం పనిచేయడమే లక్ష్యంగా కృషిచేస్తుంది

**- మాజీ భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు**

హైదరాబాద్ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బిఎం బిర్లా సైన్స్ సమాజం కోసం ఆలోచించడం.. పనిచేయడమే లక్ష్యంగా కృషిచేస్తుందని మాజీ భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు తెలిపారు. తెలుగు పత్రికారంగంలో విప్లవాన్ని సృష్టించిన రామోజీరావు ఒక ధ్రువతార అని కొనియాడారు. బిఎం బిర్లా సైన్స్ సెంటర్లో ల్యాబ్ టూ సొసైటీ రోల్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ బిన్ బిల్డింగ్ వీబీ-20 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శాస్త్రీయ అంశాలకు ప్రముఖ స్థానం కల్పిస్తున్నారని, తెలుగు పాఠకులకు శాస్త్ర విజ్ఞానాన్ని అందించాలని రామోజీరావు తాపత్రయపడ్డారని తెలియజేశారు. శాస్త్రవిజ్ఞానాన్ని నాలుగు గోడల మధ్య ఆగిపోకూడదని.. ప్రజలకు చేరాలని అన్నారు. శాస్త్రవిజ్ఞానం ప్రజల ముంగిట చేరాలని.. ఆదరణ, అవగాహన పెరగాలని.. సైన్స్ పట్ల విద్యార్థుల్లో ఉత్సుకతను పెంచాలని సూచించారు. శాస్త్రీయ జ్ఞానాన్ని ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చేరవేయాలని, సమాజంలో శాస్త్ర సాంకేతికతపై నమ్మకాన్ని పెంపొందించడం మరింత అవసరమని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. క్లిష్టమైన సైన్స్ అంశాలను సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా బిఎం బిర్లా సైన్స్ సెంటర్లో జ్ఞాననేత్రం శీర్షికను ప్రచురిస్తున్నారని కొనియాడారు. సైన్స్ పట్ల ఎంత ఆదరణ పెంచగలిగితే.. సైన్స్ లో దేశం అంత ముందుంటుందని, మానవ జీవన నాణ్యత పెంచడంలో సైన్స్ అండ్ టెక్నాలజీ పాత్ర కీలకమని అన్నారు. ఎంఎస్. స్వామినాథన్ కృషి వల్లే ఆహార రంగంలో దేశం స్వయం సమృద్ధి సాధించిందని, హరిత విప్లవం వల్ల వ్యవసాయరంగంలో కీలక పురోగతి సాధించామని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆహార పదార్థాలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామని, సాంకేతిక పరిజ్ఞానాన్ని మనకు బదిలీ చేసేందుకు పాశ్చాత్య దేశాలు నిరాకరించాయని, స్వదేశీ పరిజ్ఞానంతోనే తక్కువ ఖర్చుతో కలాం, విక్రమ్ సారాభాయ్ ఉపగ్రహాలు, క్షిపణులు తయారు చేశారని ప్రశంసించారు. ప్రస్తుతం ఉపగ్రహాలు, క్షిపణులు ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకుందని కొనియాడారు. శాస్త్ర విజ్ఞానంలో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉండాలనేది మన లక్ష్యం కావాలని, ఒకప్పుడు భారత్ విశ్వగురుగా ఉండేదని.. జ్ఞానం సంపాదించుకునేందుకు విదేశాల నుంచి వచ్చేవారని అన్నారు. విదేశాల నుంచి నలంద, తక్షశిల, విక్రమశిల వర్సిటీలకు వచ్చేవారని, కొంతమంది దురాక్రమణ వల్ల ప్రముఖ విశ్వవిద్యాలయాలు నాశనమయ్యాయని వెంకయ్యానాయుడు తెలియజేశారు.

## చీర, తాంబూలాలతో మంత్రులు సీతక్క, సురేఖకు కేసీఆర్ స్వాగతం..

హైదరాబాద్, జనవరి 8: సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర రావు(కేసీఆర్)ను తెలంగాణ మంత్రులు దనసరి అనసూయ (సీతక్క), కొండా సురేఖ కలిశారు. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు రావాలంటూ తెలంగాణ ప్రభుత్వం తరపున ఆహ్వాన పత్రికను అందజేశారు.

రాజకీయాలకతీతంగా ఈ పవిత్ర జాతరను ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ జాతరలో అందరూ పాల్గొనాలని మంత్రి సీతక్క ఈ సందర్భంగా కోరారు. తమ ఆహ్వానానికి కేసీఆర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. జాతరకు అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లను ఆహ్వానిస్తున్నామని సీతక్క తెలిపారు. ములుగు జిల్లాలో జరిగే ఈ మహా జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్‌కు కూడా మంత్రులు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

మేడారం జాతరకు రావాలంటూ తెలంగాణ మంత్రులు ఆహ్వాన పత్రికను అందజేసిన విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ తన అధికారిక ఎక్స్ ఖాతా హ్యాండిల్‌లో తెలియజేసింది. సదరు వీడియోనూ పోస్టు చేసింది. మహిళా మంత్రుల్ని కేసీఆర్ బాగున్నరా.. అమ్మ! అంటూ ఆత్మీయంగా ఆహ్వానించారని.. ఇంటికి వచ్చిన అతిథులకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సాదర ఆహ్వానం పలికారని తెలిపారు.

## తెలంగాణ రాష్ట్రంలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యం

**-రవాణా మంత్రుల వార్షిక సమావేశానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్**

న్యూ డిల్లీ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ రాష్ట్రంలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నట్టు.. మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. న్యూఢిల్లీలో గురువారం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రవాణా మంత్రుల వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు వివరించారు. ఈవీ పాలసీ తీసుకొచ్చిన కొత్తలో తెలంగాణలో కేవలం 4,376 ఎలక్ట్రిక్ వాహనాలు ఉండేవని.. కానీ 2025 ఏడాదిలో ఆ సంఖ్య 2,58,325కు పెరిగినట్టు మంత్రి చెప్పారు. తెలంగాణలో 2024లో కొత్త స్క్రాప్ పాలసీని ప్రకటించాం. పాత వాహనాలను స్క్రాప్ చేస్తే.. ట్యాక్స్ తగ్గింపు, పెనాల్టీ రద్దు వంటి ప్రోత్సాహకాలను ప్రకటించాం. అలాగే.. 15 సంవత్సరాలు దాటిన ప్రభుత్వం వాహనాలను కచ్చితంగా స్క్రాప్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ప్రైవేట్ వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ విధించి.. స్క్రాప్ చేయడానికి అనుకూలంగా నిర్ణయం తీసుకు న్నాం. తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను మరింత కఠినతరం చేశాం. ఈ ప్రక్రియలో భాగంగానే 37 ఆటోమేటెట్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. వీటి ద్వారా ఫిట్‌నెస్ లేని వాహనాలను నిలిపివేస్తున్నాం. రోడ్ సేఫ్టీని పెంచి.. కాలుష్యాన్ని తగ్గిస్తున్నా మన్నారు.. డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేసే విధానాన్ని కూడా మరింత మరింత కఠినతరం చేస్తున్నాం. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్‌ను ఏర్పాటు చేయబోతున్నాం. మాన్యువల్ సిస్టమ్‌ను తగ్గించి.. కెమెరాలు, సెన్సార్లు, ఏఐ ద్వారా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్‌ను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించాం. అలాగే.. ప్రజల భద్రత దృష్ట్యా.. వెహికిల్ లొకేషన్ ట్రాకింగ్ పరికరాలను ప్రజా రవాణా వాహనాలకు అమర్చి.. వాటిని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి.. మానిటర్ చేస్తున్నాం. డ్రైవింగ్ లెసెన్స్‌లకు సంబంధించి.. సారథి-ఎన్ఐసీ అప్లికేషన్‌ను అమలు చేస్తున్నాం. వాహనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి.. వాహన్-ఎన్ఐసీ అప్లికేషన్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం. అలాగే.. ఎలక్ట్రిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏఐ ఆధారిత పర్యవేక్షణ విధానాలను అమలు చేస్తున్నాం. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో వల్డ్ క్లాస్ ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ, మరో 2 ఐడీటీఆర్ సెంటర్ల ఏర్పాటు, ట్రక్ టర్మినల్, పార్కింగ్ యార్డుల అభివృద్ధి, హైదరాబాద్ నగరం లో ప్రైవేట్ బస్టాండ్ల నిర్మాణం, పాస్‌పోర్ట్ ఆఫీసుల తరహాలో.. ఆర్టీఓ కార్యాలయాలను ఆధునీకీకరణ చేస్తాం. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో.. మంత్రి పొన్నం ప్రభాకర్ తోపాటు.. ఉన్నతాధికారులు వికాస్ రాజ్, పాల్గొన్నారు.



## అతివేగం వల్లే మొకిలా కారు ప్రమాదం..

హైదరాబాద్, జనవరి 8:మొకిలా పోలీస్ స్టేషన్ పరిధిలోని మిర్జాగూడలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంపై చేవెళ్ల ఏసీపీ కిషన్ స్పందించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. 'తెల్లవారుజామున మిర్జాగూడ వద్ద మొకిలా నుండి రిటర్న్ వస్తుండగా ప్రమాదం జరిగింది. ఐదుగురు ఎకో స్పోర్ట్స్ కారులో ప్రయాణం చేస్తున్నారు. వీరంతా ఒకే కాలేజీలో చదువుతున్న ఫ్రెండ్స్. కారు అతివేగంతో చెట్టును ఢీ కొనడం వల్లే ప్రమాదం జరిగింది. బర్త్ డే సందర్భంగా వైభవ్ హోటల్‌లో డిన్నర్ చేశారు.

ఓ ఫ్రెండ్‌ను డ్రాప్ చేసి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ నక్షత్ర అనే అమ్మాయికి చికిత్స జరుగుతోంది. సుమిత్ కారు డ్రైవ్ చేసినట్లు గుర్తించాం. కారు అతివేగంతో అదుపుతప్పి చెట్టును ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఇంకా పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నాం' అని తెలిపారు. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఐదుగురు ఉన్నారు. వారిలో నలుగురు ఐబీఎస్ కాలేజీకి చెందిన వారు కాగా, ఒకరు ఐసీఎఫ్ఏఐ కాలేజీకి చెందిన వారు.

కోకాపేట్‌లో బర్త్‌డే పార్టీ చేసుకుని ఫ్రెండ్‌ను డ్రాప్ చేసి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నలుగురు యువకులు స్పాట్‌లోనే చనిపోయారు. నక్షత్ర అనే అమ్మాయి తీవ్రంగా గాయపడింది. ఆమెను దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. మృతులను కర్గాయల సుమిత్, శ్రీ నిఖిల్, బాల్మూరి రోహిత్, దేవాల సూర్య తేజగా గుర్తించారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం

హైదరాబాద్, జనవరి 8: రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మరికొన్ని రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం ప్రభంజనం సృష్టించాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అలాగే ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది.

తెలంగాణలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనుంది. ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు ఈ బహిరంగ సభలు నిర్వహించాలని తేదీలను ఫిక్స్ చేసింది. ఈ బహిరంగ సభల సమన్వయ బాధ్యతను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించింది. వీటిని పర్యవేక్షించే బాధ్యతను రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కట్టబెట్టింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు వేదికగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. మండలాల్లో సైతం ఈ సభలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒక మండలం బాధ్యతను తాను తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి. అలాగే ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి ప్రాజెక్టులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోందని.. ఈ వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు వరుసగా విమర్శలు గుప్పిస్తున్నారు.

ఈ విమర్శలు తిప్పికొట్టేందుకు ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అంతేకాకుండా ఈ సభల వేదిక మీద నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి తదితర పథకాలు అమలును వివరించడం ద్వారా ప్రతిపక్ష విమర్శలు తిప్పికొట్ట వచ్చనే లక్ష్యంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆ పార్టీ తీసుకుంది.

# మేధో వలస వరమా, శాపమా !

## (09 జనవరి "ప్రవాసీ భారతీయుల దినోత్సవం లేదా ఎన్ఆర్ఐ డే" సందర్భంగా)

09 జనవరి 1915న ప్రవాసీ భారతీయుడైన మహాత్మాగాంధీ దక్షిణ ఆఫ్రికా నుంచి తిరిగి తన జన్మ భూమికి చేరిన రోజుకు గుర్తుగా ప్రతి ఏట 09 జనవరిన "ప్రవాసీ భారతీయుల దినోత్సవం లేదా ప్రవాసీ భారతీయ దివస్ లేదా నాన్-రెసిడెంట్ ఇండియన్స్ డే"గా 2003 నుంచి పాటించడం జరుతున్నది. ప్రవాసీ భారతీయుల నైపుణ్యాలు, మేధస్సు, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సంపదలను తమ జన్మభూమి అభివృద్ధికి వినియోగించడాన్ని ప్రోత్సహించడం, ప్రవాసాలను సాదరంగా ఆహ్వానించడం, భారత అభివృద్ధికి కృషి చేసిన ప్రవాసీలను సన్మానించడం లాంటి అంశాలను చర్చించే వేదికగా ప్రవాసీ భారతీయుల దినోత్సవం ఉపయోగపడుతున్నది. ప్రవాసీ భారతీయ దివస్ నేపథ్యంలో న్యూఢిల్లీలో విదేశాంగ మంత్రిత్వ శాఖ "వికసిత్ భారత్ సాధనకు ప్రవాసీ భారతీయుల పాత్ర" అనబడే ప్రత్యేక సదస్సును నిర్వహించడం కూడా కొనసాగుతున్నది.

### 'వికసిత్ భారత్' లక్ష్యానికి ఊతం ఇస్తున్న ప్రవాసీ భారతీయులు:

ప్రవాసీ భారతీయులతో పాటు భారతీయ మూలాలు కలిగిన వ్యక్తులు (పరసన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్, పిఐఓ) కూడా భారత దేశంలో పెట్టుబడులు పెట్టి దేశాభివృద్ధికి చేయూతనివ్వడం నిరంతరం కొనసాగాలని ప్రభుత్వం, పౌర సమాజం కోరుకుంటున్నది. సంస్కృతులు, వాణిజ్యం, టెక్నాలజీ, ఇన్నొవేషన్, సృజన మెండుగా ఉన్న దేశభక్తి కలిగిన ప్రవాసీ భారతీయులు 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దోహదపడాలనే సదుద్దేశంతో ఎన్ఆర్ఐలను ప్రోత్సహిస్తూ రెడ్ కార్పెట్ ఆహ్వానం పలుకుతోంది. 2024 వివరాల ప్రకారం, 15 మిలియన్ల ప్రవాసీ భారతీయులు, మరో 20 మిలియన్ల భారత మూలాలు కలిగిన పిఐఓలు పలు అభివృద్ధి చెందిన దేశాల్లో స్థిరపడి ఉన్నారు. అత్యధిక ప్రవాసీ భారతీయులు కలిగిన దేశంగా అమెరికా ప్రసిద్ధిగాంచింది. అమెరికాలో 44.6 లక్షలు, యూఏఈలో 35 లక్షలు, మలేసియాలా 29.14 లక్షలు, కెనడాలో 28.76 లక్షలు, సౌథీ అరేబియాలా 24.64 లక్షల ప్రవాసీ భారతీయులు ఉన్నారని తెలుస్తున్నది.

### మేధో వలసకు పర్యాయపదంగా నిలుస్తున్న యువభారతం:

'మేధో వలస' లేదా 'బ్రెయిన్ డ్రేయిన్' అనబడే పదాన్ని తొలిసారి యూకెలో 1960లో ప్రయోగించారు. నైపుణ్యం, ఉన్నత విద్య ప్రమాణాలు కలిగిన యువత ఉన్నత భవితకు తమ దేశాన్ని వదిలి అభివృద్ధి చెందిన దేశాలకు వలస పోవడాన్ని 'మేధో వలస లేదా హూమన్ క్యాపిటల్ ఫ్లైట్' అని అంటున్నారు. అభివృద్ధి చెందుతున్న యువభారతం నుంచి ఆకర్షణీయ వేతనాలు, ఉద్యోగ అవకాశాలు, ఉన్నత ప్రమాణాలు కలిగిన యూనివర్సిటీల విద్యా బోధనలు, అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిశోధనలకు అవకాశాలు, ఉత్తమ జీవనశైలి, సులభ వీసా విధానాలు, రూపాయి విలువ పతనం, రాజకీయ స్థిరత్వం లాంటి కారణాలతో భారత యువత లక్షల సంఖ్యలో ప్రతి ఏట అభివృద్ధి చెందిన దేశాలకు వలస పోవడం, అక్కడే స్థిరపడి ప్రవాసీ భారతీయులుగా మారడం జరుగుతోంది. ఉన్నత విద్యకు మాత్రమే కాకుండా నైపుణ్యం, సృజనశీల మేధస్సు కలిగిన వ్యక్తులు కూడా విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడడం కూడా కొనసాగుతున్నాయి. భారత్‌లో విద్యా ప్రమాణాలు తగ్గడం, పరిశోధనాలయాల కొరత, నిరుద్యోగం, వేతన వ్యత్యాసాలు, రాజకీయ అస్థిరత్వం, జీవనశైలి ప్రమాణాలు తగ్గడం, ఆర్థిక అవకాశాలు మూతపడడం లాంటి కారణాలు కూడా యువత విదేశీ పయనాలకు దోహదపడుతున్నాయి. అమెరికాలో 12 శాతం శాస్త్రవేత్తలు, 38 శాతం వైద్యులు, 36 శాతం నాసా ఉద్యోగులు ప్రవాసీ భారతీయులే అని తెలిసి ఆశ్చర్యపోతున్నాం. అంతే కాకుండా మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల్లో 34 శాతం, ఐబిఎంలో 28 శాతం, ఇంటెల్‌లో 17 శాతం, గూగుల్‌లో 12 శాతం ఉద్యోగులు ప్రవాసీ భారతీయులే అని తెలుసుకోవాలి. మేధో వలసలో ప్రథమ స్థానం భారత్ చేజిక్కించుకుంది. 2022 ఏడాదిలో 7.7 లక్షల యువత విద్య కోసం విదేశాలకు వెళుతున్నారు. 2024లో దాదాపు 1.8 మిలియన్ల భారతీయ యువత చదువుల నిమిత్తం విమానయానం చేసారని తెలుస్తున్నది. 2014 నుంచి నేటి వరకు 23,000 మిలియనీర్లు భారత్‌ను వదిలి విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు. మేధో వలసను తగ్గించడానికి మన యూనివర్సిటీ విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయి వరకు పెంచడం, తిరిగి వచ్చే ప్రవాసీ భారతీయులకు పన్ను రాయితీలను ఇవ్వడం, పేటెంట్ పొందే వారికి పన్నులు తగ్గించడం లాంటివని కల్పించాలని సూచిస్తున్నారు.

### మేధో వలస వరమా, శాపమా !

భారత దేశ అమూల్య వనరు అయిన మేధావులు, నైపుణ్యం కలిగిన టెక్నోక్రాట్లు, ప్రొఫెషనల్స్ దేశాన్ని వదిలి వెళ్లడం జన్మభూమికి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నది. అదే విధంగా నిరంతరం మేధో వలస కొనసాగితే దేశ సామాజిక-ఆర్థిక సమగ్రాభివృద్ధికి తీవ్రమైన విఘాతం కలుగుతుందని తెలుసుకోవాలి. మేధో వలస వల్ల స్వదేశంలో ఇన్నొవేషన్, పరిశోధనలు, సుస్థిరాభివృద్ధి కుంటుపడుతుంది. మేధో వనరు వలస వల్ల దేశానికి కొంత ఆర్థిక చేయూత లభిస్తే అది కొంత వరకు ఊరటను ఇస్తుంది. ఒక మొక్కను నాటి, సకల పరిచర్యలు చేసి, నీరు పోసి, ఎరువు వేసి పెంచిన తర్వాత పండ్లు లభించే స్థాయిలో దానిని మరొకరు ఇవ్వడం ఎంత బాధను కలిగిస్తుందో అంతే నష్టాన్ని మేధో వలస కూడా జన్మభూమికి చేస్తుందని తెలుసుకోవాలి. మేధో వలస వల్ల అభివృద్ధి చెందిన దేశాలకుపెట్టుబడి పెట్టకుండానే 'రెడీ టు యూజ్ స్కిల్డ్ యూత్' ఉచితంగా లభిస్తున్నది.

నేటి ప్రవాసీ భారతీయ దినం వేదిక భారత దేశానికి, ప్రవాసీ భారతీయులకు మధ్య వారధిగా నిలవాలని, ప్రవాసీ పౌర సమాజం తిరిగి తమ దేశంలో మేధోపరమైన, ఆర్థికపరమైన పెట్టుబడులు పెట్టి భారతాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి చేర్చడానికి తమ వంతు కృషి చేయాలని కోరుకుందాం. మన ప్రవాసీలను ప్రేమతో ఆలింగనం చేసుకుందాం.

– ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# "పైరోలిసిస్ ద్వారా బయో-బిటుమెన్" సాంకేతిక పరిజ్ఞాన బదిలీ విజయవంతం..

న్యూఢిల్లీ, జనవరి 8:భారత రహదారుల చరిత్రలో ఈ రోజు చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. దేశం ఇవాళ 'పరిశుభ్ర, కాలుష్య రహిత రహదారుల' శకంలో పాదం మోపింది. ఈ మేరకు న్యూఢిల్లీ నిర్వహించిన కార్యక్రమంలో ''పైరోలిసిస్ ద్వారా బయో-బిటుమెన్: పంట వ్యర్థాల నుంచి రహదారుల దాకా" పేరిట రూపొందిన సాంకేతిక పరిజ్ఞాన బదిలీ పూర్తయింది. న్యూఢిల్లీలోని శాస్త్ర-పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్ఐఆర్)- కేంద్రీయ రహదారి పరిశోధన సంస్థ (సీఆర్ ఆర్ఐ), డెహ్రాడూన్‌లోని 'సీఎస్ ఐఆర్- ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం (ఐఐపీ)లు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా రూపొందించాయి.

కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూవిజ్ఞాన శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), 'సీఎస్ఐఆర్' ఉపాధ్యక్షుడు డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ సాంకేతిక పరిజ్ఞాన బదిలీ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రకటించారు.

ఈ పరిజ్ఞానంతో భారత రహదారులు ఇక శిలాజ ఇంధన పరాధీనత నుంచి జీవ-ఆధారిత, పునరుత్పాదక, వర్తుల ఆర్థిక పరిష్కారాలవైపు మళ్లుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ఈ రోజును ఒక చారిత్రక ఘట్టంగా గుర్తుంచుకుందామని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సాంకేతికతతో రహదారుల నిర్మాణ వ్యయం తగ్గడంతోపాటు అవి దీర్ఘకాలం మన్నుతాయి. అంతేకాకుండా పర్యావరణ కాలుష్యం ముప్పు నుంచి కూడా రహదారులకు విముక్తి లభిస్తుంది.

దేశంలో శాస్త్ర విజ్ఞాన, ప్రభుత్వ, సామాజిక ఏకోన్ముఖ కృషికి ఈ ఆవిష్కరణ ఒక నిదర్శనమని ఆయన అభివర్ణించారు. ఇది వికసిత భారత్ సాకారం దిశగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనల్లో రూపొందిన ఏకోన్ముఖ జాతి విధానానికి సూచిక.

పరిశుభ్రత, స్వయంసమృద్ధ భారత్, ఆర్థిక స్వావలంబన వంటి జాతీయ లక్ష్యాల సాధనకు శాస్త్రీయ పరిశోధనలు ప్రత్యక్షంగా ఎలా ఉపయోగపడతాయో బయో-బిటుమెన్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు రుజువు చేస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సమాచారం, విస్తరణ ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తూ, భాగస్వాములలో విస్తృత అవగాహన, అనుసరణ దిశగా ఆవిష్కరణలను విశదం చేయాలని ఆయన అన్నారు.

దేశవ్యాప్తంగా 'సీఎస్ఐఆర్' పరిధిలోగల 37 ప్రయోగ శాలలలో ప్రతి ఒక్కదానికీ స్ఫూర్తిదాయక విజయగాథలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే, దేశంలోని పౌరులు, పరిశ్రమలు, రాష్ట్రాలకు శాస్త్రవిజ్ఞాన వ్యాప్తికి గత దశాబ్దంలో బాటలు పడ్డాయని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రకటించారు. 'వ్యర్థం నుంచి అర్థం' విధానాన్ని ప్రస్తావిస్తూ- బయో-బిటుమెన్ ఇందుకు ఒక నిదర్శనమని పేర్కొన్నారు. ఇది ఏకకాలంలో పలు సవాళ్లను పరిష్కరిస్తుందని, పంట దుబ్బుల నిర్వహణ నుంచి పర్యావరణ పరిరక్షణ, దిగుమ తుల తగ్గింపు దాకా అంశాలను ఈ సందర్భంగా ఆయన ఉదాహరించారు. భారత్ ప్రస్తుతం తన బిటుమెన్ అవసరంలో దాదాపు 50 శాతాన్ని దిగుమతి చేసుకుంటున్నదని తెలిపారు. ఈ పరిస్థితుల నడుమ బయో- బిటుమెన్ వంటి ఆవిష్కరణలు దేశీయ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తూ విదేశీ పరాధీనతను తగ్గిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

వ్యవసాయ వ్యర్థాల పైరోలైసిస్ ప్రక్రియ ద్వారా తయారు చేసిన బయో-బిటుమెన్‌ను పారిశ్రామిక-స్థాయిలో సాంకేతిక బదిలీ చేయడాన్ని ఈ కార్యక్రమం వెల్లడి చేసింది. ఈ మేరకు పంటకోత తర్వాత వరి గడ్డి సేకరణ, ప్యాలెటైజేషన్, బయో-ఆయిల్ ఉత్పత్తి దిశగా పైరోలైసిస్, తదనంతరం సంప్రదాయ బిటుమెన్‌తో కలపడం వంటివి ఈ ప్రక్రియలో భాగంగా ఉంటాయి. తద్వారా 20-30 శాతం సంప్రదాయ బిటుమెన్‌ను పనితీరుతో రాజీ పడకుండా సురక్షితంగా రూపొందించవచ్చని విస్తృత ప్రయోగశాల ఫలితాలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ సాంకేతికతను భౌతిక, భూగర్భ, రసాయన, యాంత్రిక లక్షణాలతో పరీక్షించారు. ఈ పరీక్షలలో రాటింగ్, పగుళ్లు, తేమ నష్టం, పునరుత్థాన మాడ్యులస్ వంటివి అంతర్భాగంగా ఉన్నాయి. మేఘాలయలోని జోరాబత్-షిల్లాంగ్ ఎక్స్‌ప్రెస్‌వే (ఎన్‌హెచ్-40)పై బయో-బిటుమెన్ వినియోగంతో 100 మీటర్ల ప్రయోగాత్మక రహదారిని ఇప్పటికే విజయవంతంగా పరీక్షించారు. తద్వారా క్షేత్రస్థాయిలో సాధ్యాసాధ్యాలను నిర్ధారించే వీలుంటుంది. ఈ సాంకేతికతపై హక్కు కోసం పేటెంట్ దాఖలు చేయడంతోపాటు వాణిజ్యీకరణ దిశగా అనేక పరిశ్రమల భాగస్వామ్యానికి రంగం సిద్ధమైంది.

ఈ కార్యక్రమం సందర్భంగా 'సీఎస్ఐఆర్' బృందాన్ని మంత్రి అభినందించారు. బయో- బిటుమెన్ ఆవిష్కరణ ప్రపంచవ్యాప్త కీలక పురోగమనంలో భాగమని ఆయన అభివర్ణించారు. ఈ ఆవిష్కరణ ఫలితంగా ఏటా -25-30 వేల కోట్ల విలువైన బిటుమెన్ దిగుమతులు తగ్గడమే గాక ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రాంతీయ-నిర్దిష్ట, వనరుల ఆధారిత పరిశోధనల విస్తృతికి పిలుపునిచ్చారు.

రహదారుల నిర్మాణంలో స్టీల్ స్లాగ్, ప్లాస్టిక్ వ్యర్థాలు, బయో-ఇంధనం వంటి ప్రత్యామ్నాయ పదార్థాల వినియోగంలో తన అనుభవాలను, ఆలోచనలను మంత్రి అందరితోనూ పంచుకున్నారు. నిదర్శనాధారిత సాంకేతికత, ఆర్థిక గిట్టుబాటు, ముడి పదార్థాల లభ్యత, మార్కెట్ సామర్థ్యం తదితరాల కలయికతో దీన్ని విజయవంతంగా భారీ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. జాతీయ రహదారి ప్రమాణాలతో బయో-బిటుమెన్ అనుసంధానానికి పూర్తి సంస్థాగత మద్దతుపై ఆయన హామీ ఇచ్చారు.

'సీఎస్ఐఆర్' డైరెక్టర్ జనరల్-'డీఎస్ఐఆర్' కార్యదర్శి ఎన్. కలైసెల్వి మాట్లాడుతూ- ఇది భారత శాస్త్రవిజ్ఞాన రంగానికి గర్వకారణ ఘట్టమని అభివర్ణించారు. ప్రపంచంలో కేవలం ఒక ఏడాదిలోనే బయో-బిటుమెన్ సాంకేతికతను పారిశ్రామిక-వాణిజ్య స్థాయికి తీసుకెళ్లిన తొలి దేశంగా భారత్ అవతరించిందని ఆమె పేర్కొన్నారు. బయోమాస్ పైరోలైసిస్ ప్రక్రియతో బహుళ ప్రయోజనాలున్నాయని తెలిపారు. రోడ్లకు బయో-బైండర్, చౌక విమాన ఇంధనం, బయో-పురుగుమందు ముడిపదార్థాల తయారీతోపాటు బ్యాటరీలు, నీటి శుద్ధి, అధునాతన పదార్థాలకు అనువైన హై-గ్రేడ్ కర్బన ఉత్పత్తి తదితరాలకు ఉపయోగపడుతుందని వివరించారు. తద్వారా ఈ ప్రక్రియ ఉద్గార రహితం, పొదుపు, భవిష్యత్ సంసిద్ధం కాగలదన్నారు. దేశవ్యాప్తంగా వినియోగాన్ని విస్తరించేందుకు బయో- బిటుమెన్ మిశ్రమాన్ని విధాన స్థాయిలో అమలు చేయాలని కూడా ఆమె ప్రతిపాదించారు.

ఈ కార్యక్రమంలో 'సీఎస్ ఐఆర్-సీఆర్ఆర్ఐ, సీఎస్ఐ ఆర్-ఐఐపీ' బృందాల సీనియర్ సారథులు, మాజీ డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ భాగస్వాములు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. శాస్త్రవిజ్ఞాన, ప్రభుత్వ, పరిశ్రమ రంగాల మధ్య బలమైన భాగస్వామ్యాన్ని ఇది ప్రతిబింబించింది. సుస్థిర మౌలిక సదుపాయాలు, స్వదేశీ ఆవిష్కరణలు, జీవ-ఆధారిత ఆర్థిక భవిష్యత్తుపై భారత్ నిబద్ధతను ఈ సాంకేతికత బదిలీ కార్యక్రమం ప్రస్ఫుటం చేసింది. దేశాన్ని పరిశుభ్ర, కాలుష్య రహిత, స్వయంసమృద్ధ రహదారుల పథంలో దృఢంగా నిలిపింది.

## వ్యవసాయ వ్యర్థాలను విలువైన జాతీయ వనరుగా మార్చవచ్చన్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, జనవరి 8:వ్యవసాయ వ్యర్థాలను విలువైన జాతీయ వనరుగా ఎలా మార్చవచ్చో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ వివరించారు. జైవిక తారు వికసిత్ భారత్ 2047 దార్శనికతను ముందుకు తీసుకెళ్ళే ఒక విప్లవాత్మక చర్యగా ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించడం ద్వారా పంట కాల్చడం వల్ల ఏర్పడే కాలుష్యాన్ని తగ్గించి, సర్క్యులర్ ఎకనామిని బలోపేతం చేస్తుంది. 15 శాతం మిశ్రమంతో భారత్ సుమారు రూ. 4,500 కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసుకోవచ్చు. అలాగే దిగుమతి చేసుకున్న ముడి చమురుపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

''వ్యవసాయ అవశేషాల నుంచి రోడ్డు వరకు: పైరోలైసిస్ ద్వారా జైవిక తారు" ఇతివృత్తంతో జరిగిన సీఎస్ఐఆర్ సాంకేతిక బదిలీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరి మాట్లాడుతూ.. 'నేడు దేశ రోడ్డు మౌలిక సదుపాయాల్లో ఒక చారిత్రక మైలురాయిని సూచిస్తోందన్నారు. వాణిజ్యపరంగా జైవిక తారును వాణిజ్యంగా ఉత్పత్తి చేయడంలో ప్రపంచంలోనే భారత్ మొదటి దేశంగా నిలిచిందని తెలిపారు. సీఎస్ఐఆర్, వారి నిబద్ధతగల శాస్త్రవేత్తలను కేంద్రమంత్రి అభినందించారు. ఈ మార్గదర్శక పురోగతిని సాధించడంలో స్థిరమైన మద్దతు అందించిన కేంద్రమంత్రి శ్రీ జితేంద్ర సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఈ నూతన ఆవిష్కరణలు రైతులకు సాధికారత కల్పించడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిని కల్పిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని శ్రీ గడ్కరీ తెలిపారు. సుస్థిర అభివృద్ధి, స్వయం సమృద్ధి, పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన వృద్ధి పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు జైవిక తారు నిదర్శనమని అన్నారు. ఇది పరిశుభ్రమైన, పచ్చని భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# మహిళల స్వావలంబనకే పెద్దపీట..

**-పి 4లో ఉచిత బ్యూటీషియన్ శిక్షణలతో స్వయం ఉపాధికి బాటలు..**
**-స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా గౌరవప్రదమైన జీవితం..**
**-యువత, మహిళలకు ఉచిత శిక్షణలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు**
**-ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు..**



అమరావతి, జనవరి 8:మహిళల ఆర్థిక స్వావలంబనకు, స్వయం ఉపాధికి ప్రభుత్వమే అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. పి 4 కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితంగా అందిస్తున్న బ్యూటీషియన్ శిక్షణలు వారి జీవితాల్లో సుస్థిరమైన మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

సెంట్రల్ నియోజకవర్గం 32వ డివిజన్ రామలింగేశ్వరపేట, మూడవ లైన్‌లో గుణాదిత్య ఇంటిగ్రల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ కోర్సుల ప్రారంభోత్సవం ఇవాళ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొండా ఉమా మాట్లాడుతూ? స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారానే నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమని తెలిపారు.

యువతీ యువకులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకునేలా ప్రభుత్వం ఉచిత శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తోందన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్‌తో పాటు డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీఏ చదివిన వారికి కూడా వారి అర్హతలకు తగిన విధంగా ఐటీ కోర్సులు, జావా, ఏ డబ్ల్యు ఎస్ వంటి ఆధునిక సాంకేతిక శిక్షణలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఈ శిక్షణలు ఉద్యోగాలు లేదా స్వయం ఉపాధి సాధించేలా రూపకల్పన చేయబడినవని వివరించారు. మహిళలకు ఇంటి వద్ద నుంచే ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్న ఆయన బ్యూటీషియన్ కోర్సుల ద్వారా మహిళలు ఇంటి వద్ద నుంచే లేదా ఇంటి సమీపంలో పని చేస్తూ ఆదాయం పొందే అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

శిక్షణ పూర్తిచేసిన వారు స్వంతంగా బ్యూటీ పార్లర్లు ప్రారంభించవచ్చని, లేక ఇతర పార్లర్లలో ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. ఇందుకు అవసరమైన సబ్సిడీలు, రుణాలు ప్రభుత్వ పరంగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పి 4 కార్యక్రమంలో భాగంగా అనేక స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పెద్ద ఎత్తున శిక్షణలు అందిస్తున్నాయని, ఇది ఉపాధి అవకాశాల విస్తరణకు దోహదపడుతోందన్నారు.

మహిళలు జనాభాలో సగభాగం ఉన్నారని, ఈ రంగంలో వారికి విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. చదువుకున్నా, చదువుకోని వారైనా అందరూ తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పీ 4 కార్యక్రమం, ఎన్జీవోల సమన్వయంతో మరిన్ని శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు మరింతగా అండగా నిలుస్తామని బొండా ఉమా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర 2047 టీమ్, రమేష్, ఆరాధ్యుల మురళి, విజయకృష్ణ సూపర్ బజార్ చైర్మన్ వెలగా సురేష్, పరశు నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# సుజనా చౌదరి కార్యాలయంలో మొక్కల పంపిణీ..

## కాలుష్య నివారణే లక్ష్యంగా

**-హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో మేము సైతం అంటూ పశ్చిమ నాయకులు..**

విజయవాడ జనవరి 8: : విజయవాడ భవానీపురంలోని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయంలో ఫల, పూల మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కలు పెంచుదాం.. కాలుష్యాన్ని తగ్గిద్దాం అనే నినాదంతో విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ మొక్కల పెంపకం కార్యక్రమానికి పిలుపునిచ్చింది.




అందులో భాగంగా డివిజన్ కు 135 మొక్కల చొప్పున పశ్చిమ నియోజకవర్గంలోని 22 డివిజన్లలో మొక్కలు నాటించేలా చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గానికి సంబందించిన మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, వివిధ డివిజన్లకు చెందిన కూటమి నాయకులకు, స్థానికులకు మొక్కలను పంపిణీ చేశారు. వివిధ రకాల పండ్లు, పూల మొక్కలను ఈ సందర్భంగా కూటమి నాయకులు అందుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద బాబు, టీడీపీ నాయకులు మైలవరపు దుర్గా రావు, జనసేన నాయకురాలు తిరుపతి అనూష, బీజేపీ నాయకులు దుర్బేసుల హుస్సేన్, పాల్గొన్నారు.

## చైనాలో మంచు సునామీ...జిన్‌జియాంగ్ ప్రాంతంలో గడ్డ కట్టిన ఓ నది

బీజింగ్ జనవరి 8 (ఎక్స్‌ప్రెస్ న్యూస్ ); శీతాకాలం కావడంతో ప్రపంచ వ్యాప్తంగా విపరీతంగా మంచు కురుస్తోంది. ఈ మంచు కారణంగా కొన్ని చోట్ల అవలాంఛ్‌లు ఏర్పడుతుండగా.. మరికొన్ని చోట్ల మంచు సునామీలు సంభవిస్తున్నాయి. తాజాగా చైనా లో మంచు సునామీ వచ్చింది. జిన్‌జియాంగ్ ప్రాంతంలో గడ్డ కట్టిన ఓ నదిలో 'మంచు సునామీ' అలలు ఏర్పడ్డాయి.

చెట్లపై ఉన్న మంచు సైతం ఒక్కసారిగా కింద^కు పడి ంది. మంచు సునామిని చూసిన స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# దేశంలోకి బంగారం అక్రమ రవాణా.. ముఠా గుట్టును రట్టు చేసిన డీఆర్ఐ

న్యూఢిల్లీ, జనవరి 8:దేశ సరిహద్దుల ద్వారా జరుగుతున్న బంగారం అక్రమ రవాణాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డీఆర్ఐ) భారీ ఎత్తున దాడులు నిర్వహించింది. ఢిల్లీ, అగర్తలాలో నిర్వహించిన సోదాల్లో... దుబాయ్, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ బంగారం అక్రమ రవాణా ముఠా గుట్టును ఛేదించింది. ఈ దాడుల్లో 29 కిలోలకుపైగా విదేశీ బంగారం, రూ. 2.90 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నమ్మకంగా అందిన సమాచారం మేరకు అధికారులు దాడులు నిర్వహించారు. అందిన సమాచారం మేర కు.. జనవరి 6, 2025న ముఠాలోని కీలక సభ్యుడిని ఢిల్లీలో పట్టుకున్నారు. త్రిపురలోని అగర్తలా నుంచి రెండు పార్శిళ్లు ఢిల్లీలోని గోదాముకు వచ్చాయి. పరిశీలించగా, అందులో 15 కేజీల విదేశీ బంగారం ఉన్నట్లు కనుగొన్నారు. రూ.20.73 కోట్ల విలువైన ఈ బంగారంపై విదేశాల్లో తయారైనట్లుగా ముద్రలు కూడా ఉన్నాయి. ఏకకాలంలో ఢిల్లీ, అగర్తలాల్లో దాడులు నిర్వహించగా, మరో 14.2 కేజీల విదేశీ బంగారం, రూ.2.9 కోట్ల విలువైన భారత, బంగ్లాదేశ్ నగదు కూడా దొరికాయి.కస్టమ్స్ చట్టంలోని నిబంధనల ప్రకారం సుమారు రూ. 40 కోట్ల విలువైన 29.2 కిలోల బంగారం, రూ. 2.9 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ ముఠాకు చెందిన నలుగురు సభ్యులను అరెస్టు చేశారు.త్రిపుర వద్ద ఉన్న భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ద్వారా ఈ ముఠా దేశంలోకి బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తోందని దర్యాప్తులో వెల్లడైంది. దుబాయ్, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేస్తున్న ముఠా నిర్వాహకులు.. అగర్తలాలో అభరణాల దుకాణాలు నడుపుతున్న స్థానిక వ్యక్తుల సహకారంతో ఈ బంగారాన్ని దేశీయ కార్గో సేవల ద్వారా ఢిల్లీకి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.అక్రమ బంగారు రవాణాను అడ్డుకోవడం ద్వారా దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుతూ.. న్యాయమైన, పారదర్శక వాణిజ్య వాతావరణాన్ని నిర్ధారించడంలో డీఆర్ఐ నిరంతరం కృషి చేస్తోంది.

# ఫ్లెమింగో ఫెస్టివల్‌కు స్వాగతం పలుకుతూ ర్యాలీ

**-ఈ నెల 10, 11 తేదీల్లో సూళ్లూరుపేటలో జరిగే ఫ్లెమింగో వేడుకలు**
**-పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన అధికారులు**
**-పక్షుల పండుగను వీక్షించేందుకు పిల్లలకు ఉచిత బస్సుల సౌకర్యం**
**-పక్షుల ప్రేమికుల కోసం శ్రీసిటీ లో రెండురోజులు వర్క్ షాప్ నిర్వహణ**
**-సీసీ కెమరాలు, డ్రోన్ సహాయంతో క్రౌడ్, ట్రాఫిక్ కంట్రోల్**
**-ఎలాంటి సంఘటనలు జరగకుండా నిరంతరం ప్రత్యేక భద్రతా చర్యలు**

తిరుపతి, జనవరి 8: పక్షుల పండగకు స్వాగతం పలుకుతూ ఈ నెల 10, 11 తేదేలలో సూళ్లూరుపేటలో ఫ్లెమింగో వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర తెలిపారు. ఇవాళ ఉదయం స్థానిక ఎన్. వి యూనివర్సిటీ తారకరామ మైదానం నుంచి నాలుగు కాళ్ళ మండపం వరకు జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్ ర్యాలీ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షీ, పర్యాటక శాఖ ఆర్ డి రమణ ప్రసాద్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ రమేష్ నాద్ లింగుంట్ల, జిల్లా విద్యా శాఖాధికారి కె.వి.ఎన్ కుమార్, సమగ్ర శిక్ష సీఎంఓ సురేష్, ఎంఈఓ బాలాజీ, విద్యార్థినీ విద్యార్థులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు.




ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో పులికాట్ సరస్సు తీరాన ఈనెల 10, 11 తేదీల్లో ఫ్లెమింగో వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పండుగను పెద్ద ఎత్తున నిర్వహించేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. గత ఏడాది మూడు రోజులు పాటు ఘనంగా ఈ పక్షుల పండగ నిర్వహించామని, దాదాపు 3 నుండి 4 లక్షలకుపైన సందర్శకులు నేలపట్టు, అటకాని దిబ్బ, బివి పాల్యం బోటింగ్, సూళ్ళూరు పేటలో నిర్వహించినటువంటి వివిధ రకాల స్టాల్స్, ఆటల పోటీలు, ఫ్లెమింగో పక్షులు, నేలపట్టుకు వచ్చే అనేకమైన పక్షుల జాతులను గమనిస్తూ వాటిని, వాటి పర్యావరణాన్ని, ఎకో సిస్టంను పెంపొం దించడానికి చర్యలు తీసుకోవ డం జరుగుతుందని తెలిపారు.

ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.. బివి పాల్యంలో స్థానిక బోట్స్ మెన్ సొసైటీల చేయూత కోసం బోటింగ్ కోసం మినిమల్ ఫీజ్ పెట్టడం జరిగిందని, వచ్చిన మొత్తాన్ని మత్స్యకారుల సంఘాలకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. చాలా అట్టహాసంగా కార్యక్రమాలు నిర్వహించుకోబోతున్నామని తెలిపారు. నిఘా నేత్రం కూడా చాలా పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నామని, సీసీ కెమరాలు, డ్రోన్ సహాయంతో క్రౌడ్ కంట్రోల్, ట్రాఫిక్ మూమెంట్, ఎలాంటి సంఘటనలు జరగకుండా పర్యవేక్షిస్తూ ఉంటామని తెలిపారు.

స్థానిక శాసనసభ్యులు వారి ఆద్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. వారి సలహాలు సూచనలు తీసుకుంటూ ఒక మంచి వాతావరణంలో ఈ సారి ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిం చుకోవడం జరుగుతుందని తెలిపారు. గౌరవ, జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేశ్, దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ కార్యక్రమానికి 10,11 తేదీలలో ముఖ్య అతిధులుగా హాజరు కానున్నారని తెలిపారు.

సందర్శకులు పక్షులను వీక్షించి టూరిజం పెంపొంది ంచుటకు కృషి చేయాలని తెలిపారు. పెద్ద ఎత్తున ఫ్లెమింగో ఫెస్టివల్ ను టూరిజం ఇస్ ది బిగ్గెస్ట్ ఇజం అని రాష్ట్ర ముఖ్యమంత్రి చెబుతుంటారని, ఆయన మాటలను స్ఫూర్తిగా తీసుకొని టూరిజం అభివృద్ధి దిశగా కృషి చేస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు పెంపొందిస్తూ, సందర్శకులు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకొస్తూ.. జిల్లా యంత్రాంగం పూర్తిగా సన్నద్ధమై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ జి ఓ లను భాగస్వామ్యం చేశామని తెలిపారు. శ్రీ సిటీ, ఇండస్ట్రీస్, ఐఐటి, ఐజర్, పద్మావతి మహిళా యూనివర్సిటీ, ఎస్.వి యూనివర్సిటీ వారి ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

## అది జరగాలంటే చైనా, రష్యాతో సంబంధాలు తెంచుకోవాలి..

**-వెనెజువెలాకు ట్రంప్ టీమ్ షరతులు**

న్యూ డిల్లీ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండో దఫా పాలనలో విదేశాంగ విధానం ద్వారా తన ఆకాంక్షలను తీర్చుకునే పనిలో పడ్డారు. రాత్రికి రాత్రి వెనెజువెలా పై కమాండో దాడి జరిపి ఆ దేశ అధ్యక్షుడిని, ఆయన భార్యను బందీలుగా అమెరికాకు తరలించి ట్రంప్ తన పంతం నెరవేర్చుకున్నారు. అంతటితో ఆగని ట్రంప్.. దక్షిణ అమెరికా దేశాన్ని మొత్తం తానే నియంత్రిస్తున్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రభుత్వానికి ట్రంప్ కీలక హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. వెనెజువెలా కొత్త నాయకత్వం చైనా, రష్యా, ఇరాన్, క్యూబాలతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. అంతేకాదు, చమురు ఉత్పత్తిలో అమెరికాతో మాత్రమే భాగస్వామ్యం చేయాలని, ముఖ్యంగా హెవీ క్రూడ్ ఆయిల్ విక్రయాల్లో అమెరికాకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. వెనెజువెలా చమురు ఉత్పత్తిని పెంచుకోవాలంటే తాను పెట్టిన ఈ షరతులు పాటించాలని ట్రంప్ టీమ్ స్పష్టం చేసినట్లు ఏబీసీ న్యూస్ నివేదిక వెల్లడించింది. 'మొదట ఆ దేశం (వెనెజువెలా) చైనా, రష్యా, ఇరాన్, క్యూబాతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలి. రెండోది.. వెనెజువెలా చమురు ఉత్పత్తిలో అమెరికాతో ప్రత్యేక భాగస్వామిగా ఉండేందుకు, భారీ ముడి చమురు విక్రయాల్లో అమెరికాకు అనుకూలంగా ఉండేందుకు అంగీకరించాలి' అని ట్రంప్ టీమ్ షరతులు పెట్టినట్లు సదరు నివేదిక పేర్కొంది.

# ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కమీషన్‌లకు కక్కుర్తి

**-అందుకే ప్రాజెక్టును పక్కనపెట్టారు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



ఖమ్మం జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఇక్కడి ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో ఈ కార్యక్రమం జరిగింది. నాడు– ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడం కోసం కేసీఆర్ సీతారామసాగర్ ప్రాజెక్టును నిర్మించ తలపెట్టి 90 శాతం పనులను పూర్తిచేశారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాలో 7.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, గోదావరి జలాలపై పూర్తి హక్కులు ఖమ్మం జిల్లాకే దక్కాలని నాడు కేసీఆర్ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కమీషన్‌లకు కక్కుర్తి పడి ప్రాజెక్టును పక్కనపెట్టారని మండిపడ్డారు. ఆ ముగ్గురు మంత్రులు ప్రజలకు మేలు చేయగల మొనగాళ్లు కాదని, మోసగాళ్లని కేటీఆర్ విమర్శించారు. వారు 30 శాతం చొప్పున కమీషన్‌లు వసూలు చేసి జేబులు నింపుకోవడమే తప్ప జిల్లాకు పనికొచ్చే పనులు ఒక్కటి కూడా చేయడం లేదని ఆరోపిం చారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో ఈస్ట్‌మన్ కలర్‌లో సినిమా చూపెట్టారని, ఇదిస్తాం.. అదిస్తాం అని నోటికొచ్చిన హామీలు ఇచ్చారని, అధికారం లోకి వచ్చి రెండేళ్లయినా ఏదీ ఇవ్వలేదని విమర్శించారు. అశ్వారావుపేటలో ఒక్క సీతారామసాగర్ ప్రాజెక్టు ద్వారా 1.30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా కేసీఆర్ డిజైన్ చేశారని కేటీఆర్ చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు, ఇల్లందు నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు, కొత్తగూడెంలో 10 వేల ఎకరాలకు, వైరాలో 20 వేల ఎకరాలకు నీళ్లిచ్చేలా కేసీఆర్‌గారు సీతారామ ప్రాజెక్టును డిజైన్ చేశారు. కానీ ఆ ప్రాజెక్టును ప్రభుత్వం పక్కనపెట్టింది. ఈ రెండేళ్లలో ప్రభుత్వం చేసింది ఏమైనా ఉందంటే.. అది ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలేని, కేటీఆర్ ఎద్దేవా చేశారు.

# స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) కింద చేపట్టిన సామాజిక భాగస్వామ్య కార్యక్రమాలను ప్రశంసించిన జలశక్తి శాఖా మంత్రి సి.ఆర్. పాటిల్

న్యూఢిల్లీ, జనవరి 8:స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) కింద దేశవ్యాప్తంగా 'విసర్జక వ్యర్థాల నిర్వహణ' కోసం అవలంబిస్తున్న పద్ధతులపై చర్చించేందుకు.. పలు రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లోని వివిధ జిల్లాలతో 2026 జనవరి 6న జలశక్తి మంత్రిత్వ శాఖ వర్చువల్ సమావేశాన్ని నిర్వహించింది.

ఈ సమావేశానికి గౌరవ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి శ్రీ సి. ఆర్. పాటిల్ అధ్యక్షత వహించారు. జలశక్తి శాఖ సహాయ మంత్రి శ్రీ వి. సోమన్న, తాగునీరు, పారిశుద్ధ్య విభాగం కార్యదర్శి శ్రీ అశోక్ కె.కె. మీనా, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) సంయుక్త కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ ఐశ్వర్య సింగ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా పంచాయతీల సీఈవోలు, స్వయం సహాయక బృందాల సభ్యులు, పంచాయతీ సభ్యులతోపాటు రాష్ట్రాల మిషన్ డైరెక్టర్లు, రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన నోడల్ విభాగాల సీనియర్ అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

దేశంలోని వివిధ ప్రాంతాల్లో విజయవంతమైన, విస్తృతంగా చేపట్టిన విసర్జక వ్యర్థాల నిర్వహణ పద్ధతులను అందరికీ తెలియజేయడం, వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలతోపాటు జిల్లాల మధ్య పరస్పర అవగాహనను బలోపేతం చేయడం, టాయిలెట్ల నిర్మాణానికే పరిమితం కాకుండా.. పారిశుద్ధ్య వ్యవస్థపై సంపూర్ణంగా దృష్టి సారిస్తూ సురక్షిత పారిశుద్ధ్య ప్రాధాన్యాన్ని చాటడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం.

గుజరాత్, సిక్కిం, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, లడాఖ్, త్రిపుర ప్రతినిధులు తమ క్షేత్ర స్థాయి అనుభవాలను పంచుకున్నారు. విసర్జక వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లలో అంతరాయం లేకుండా కార్యకలాపాలు, నిర్వహణ కోసం... స్వయం సహాయక బృందాలు, పంచాయతీలతో కలిసి స్థానికంగానే వ్యర్థాల నిర్వహణ పద్ధతులు, తాము చేపట్టిన సామాజిక భాగస్వామ్య విధానాలు, కార్యక్రమాలను వివరించారు. అలాగే విసర్జక వ్యర్థాల నిర్వహణ కోసం పట్టణ – గ్రామీణ అనుసంధానాన్ని కూడా వారు వివరించారు. విసర్జక వ్యర్థాలు, మురుగునీటి సురక్షిత సేకరణ, రవాణా, శుద్ధి, పునర్వినియోగ ప్రయత్నాలపైనా చర్చించారు. ఈ పద్ధతుల ద్వారా స్వచ్ఛతతోపాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగయ్యాయి.

సమావేశంలో భాగంగా దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న పలు వినూత్న, విస్తరణకు అవకాశమున్న 'విసర్జక వ్యర్థాల నిర్వహణ' పద్ధతులను రాష్ట్రాలు వివరించాయి. ఒడిశాలోని ఖోర్ధా జిల్లాలో ఓ మంచి ఉదాహరణను గమనించవచ్చు. అక్కడ ట్రాన్స్ జెండర్లతో కూడిన ఓ స్వయం సహాయక బృందం నేతృత్వంలో విసర్జక వ్యర్థాల నిర్వహణ ప్లాంటు (ఎఫ్ఎస్‌టీపీ) కార్యకలాపాలు, నిర్వహణ జరుగుతున్నాయి. సమ్మిళితమైన, అంతరాయం లేని పారిశుద్ధ్య సేవలను అందించడమెలాగో ఇది వివరిస్తోంది. అదే సమయంలో ట్రాన్స్‌జెండర్లకు గౌరవప్రదమైన ఉపాధి అవకాశాన్నీ అందించింది. అత్యవసర సేవలను అందరికీ మరింతగా అందుబాటులోకి తేవడం, సామాజిక సమ్మిళితత్వాన్ని ప్రోత్సహించడం, అణగారిన వర్గాల ఆర్థిక సాధికారతను బలోపేతం చేయడంలో.. సామాజిక భాగస్వామ్యం ఉన్న సంస్థల శక్తి ఈ నమూనా ద్వారా స్పష్టమవుతోంది.

ఇతర విసర్జక వ్యర్థాల నిర్వహణ పద్ధతులు: గుజరాత్‌లోని డాంగ్ జిల్లాలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో ట్విన్ పిట్ టాయిలెట్లను భారీ స్థాయిలో అందుబాటులోకి తెచ్చారు. సిక్కింలోని మాంగన్ జిల్లాలో సింగిల్ పిట్ టాయిలెట్లను ట్విన్ పిట్ టాయిలెట్లుగా అమర్చేలా సమగ్ర చర్యలు చేపట్టారు. తద్వారా మారుమూల, కొండ ప్రాంతాల్లో విసర్జక వ్యర్థాల నిర్వహణ సక్రమంగా సాగుతుంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా కాలిబిల్లోడ్ గ్రామపంచాయతీలో దేశంలో మొదటి గ్రామీణ 'విసర్జక వ్యర్థాల నిర్వహణ ప్లాంటు (ఎఫ్ఎస్‌టీపీ)'ని ఏర్పాటు చేశారు. అక్కడ శుద్ధి చేసి బయటకు వచ్చే నీటిలో చేపల పెంపకం చేపట్టడం ఒక వినూత్న ప్రయోగం. దీనితోపాటు ఆదాయ వనరులను పెంచుకోవడం కోసం అక్కడ 'మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్)'ను కూడా అనుసంధానించారు. కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలో క్లస్టర్ భాగస్వామ్యమున్న ఎఫ్ఎస్‌టీపీ పద్ధతిని అవలంబిస్తున్నారు. ఇందులో కార్యకలాపాలు, నిర్వహణలో స్వయం సహాయక బృందాల బలమైన భాగస్వామ్యం ఉంటుంది. లడాఖ్‌లోని లేహ్ జిల్లాలో అత్యంత శీతల, పొడి, ఎత్తైన ప్రాంతాల్లో ఎకోసాన్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. త్రిపురలోని గోమతి జిల్లాలో బహిరంగ కార్యక్రమాలు, సామూహిక సమావేశాలు, జాతరల కోసం మొబైల్ బయో టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నారు. స్వీయ లావాదేవీల ద్వారా స్థానిక స్వయం సహాయక బృందాలు వీటి కార్యకలాపాలు, నిర్వహణను పర్యవేక్షిస్తున్నాయి.

క్షేత్రస్థాయిలో ఈ పారిశుద్ధ్య విధానాలను నేరుగా అమలు చేస్తున్న వ్యక్తులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. గౌరవ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి శ్రీ సి.ఆర్. పాటిల్‌తో వారు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు స్థానిక భాషల్లో మాట్లాడేందుకు కూడా అవకాశమిచ్చారు. దాంతో వారు ఉత్సాహంగా తమ అనుభవాలను వెల్లడించారు.

స్వచ్ఛ భారత్‌కు దోహదపడడంతోపాటు ఆదాయ, ఉపాధి అవకాశాలను అందించే వినూత్న పద్ధతులను.. ఈ కార్యక్రమంలో పాల్గొని వివరించిన ప్రతి ఒక్కరినీ గౌరవ జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ అభినందించారు. ఈ కార్యక్రమాల్లో చాలా వరకూ క్లిష్టమైన భౌగోళిక ప్రదేశాల్లో అమలు చేసినవేనన్న కేంద్ర మంత్రి.. సవాళ్లతో కూడిన పరిస్థితులు శాశ్వత పరిష్కారాల దిశగా స్ఫూర్తినిస్తాయనేందుకు ఇవి నిదర్శనమన్నారు. సుస్థిర గ్రామీణ పారిశుద్ధ్యంలో విసర్జక వ్యర్థాల నిర్వహణ ముఖ్యమైన అంశమని ఆయన పేర్కొన్నారు. సంపూర్ణ స్వచ్ఛతకు భరోసానివ్వడమే కాకుండా ప్రజారోగ్యాన్నీ, పర్యావరణాన్నీ పరిరక్షించేందుకు ఇది కీలకమన్నారు. సామాజిక భాగస్వామ్యం, స్వయం సహాయక బృందాలు, పంచాయతీలు, వివిధ భాగస్వామ్య సంస్థల సహకారం, పరిస్థితులకూ అవసరాలకూ తగిన సాంకేతికతలను అవలంబించడం వంటి అంశాలు.. విసర్జక వ్యర్థాల నిర్వహణను ఆచరణీయంగా, సమ్మిళితంగా, దీర్ఘకాలికంగా మారుస్తాయని ఆయన స్పష్టం చేశారు. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో.. దేశవ్యాప్తంగా స్వచ్ఛతా ఉద్యమం మునుపెన్నడూ లేనంతగా ఊపందుకుందన్నారు. పరిశుభ్రత, ప్రజా భాగస్వామ్యం అనే గాంధీజీ సందేశం దేశంలోని నలుమూలలకూ చేరిందన్నారు.

దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) కింద– సాంకేతిక సహకారం, సామర్థ్యాభివృద్ధి, వినూత్న, సామాజిక భాగస్వామ్య, సమ్మిళిత విధానాలకు ప్రోత్సాహం ద్వారా.. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కృషిని బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించింది.

# పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి: ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిలాంటిదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి వెల్లడించారు. బుధవారం ఆయన ఏలూరు జిల్లా పోలవరంలో మంత్రులతో కలసి పోలవరం ప్రాజెక్టు ను సందర్శించారు. కాఫర్ డ్యామ్, బట్రస్ డ్యామ్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన పోలవరంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ రాష్ట్రంలోని రాయలసీమ నీటి ప్రాజెక్టులపై చిల్లర రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. రాయలసీమకు ఎత్తిపోతల ద్వారా నీటి వాడకాన్ని నిలిపివేసినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తుందని దుయ్యబట్టారు. తనపై బురద చల్లడం వల్ల ఆరోపణలు నిజం కాబోవని స్పష్టం చేశారు. కన్‌స్ట్రక్టివ్ రాజకీయాలు చేయాలని సూచించారు. పోలవరం గ్యాప్ -1లో పనులన్నీ ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్యాప్-2లో అప్‌స్ట్రీమ్ , డౌన్ స్ట్రీమ్ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. రైట్ కనెక్టివిటీలో 19 మీటర్లు వెడల్పు, ఎత్తుతో రెండు టన్నెళ్లు వస్తాయని పేర్కొన్నారు. విశాఖకు నీరు తీసుకెళ్లే కాలువను బాగా వెడల్పు చేశామని, దీంతో అనకాపల్లి, విశాఖ జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని వెల్లడించారు. పట్టిసీమ ఎత్తిపోతలను ఏడాది వ్యవధిలో పూర్తి చేశామని వివరించారు. ఈ సంవత్సరం 97 శాతం అన్ని జల నీటివనరుల్లోకి నీరు వచ్చి చేరిందని , ప్రస్తుతం అన్ని జలాశయాల్లో 780 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇది ఎంతో గర్వకారణమని అన్నారు. శ్రీశైలంలో నీళ్లు పొదుపు చేసి రాయలసీమకు నీరివ్వగలిగామని వెల్లడించారు. రాయలసీమలో గొల్లపల్లి కట్టి కియా మోటార్స్ తీసుకొచ్చానని వివరించారు.

## సుద్దపల్లి సుధాకర్, శ్రీకాంత్ లను కోర్టులో హాజరు పర్చాలి

**-పోలీస్ అధికారులకు పిఓడబ్ల్యూ మహిళా సంఘం జాతీయ కార్యదర్శి సంపంగి పద్మక్క విజ్ఞప్తి**

హైదరాబాద్ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )సిరిసిల్ల పోలీస్ లు విచారణ పేరుతో మంగళవారం మధ్యానం అదుపులోకి తెవేసుకున్న సీపీఐ ( ఎమ్ ఎల్) చంద్రు పుల్లారెడ్డి పార్టీ అనుబంధ రైతు కూలి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సుద్దపల్లి సుధాకర్, శ్రీకాంత్ లను ఎలాంటి హానీ చెయ్యకుండా కోర్టు లో హాజరు పర్చాలని పిఓడబ్ల్యూ మహిళా సంఘం జాతీయ కార్యదర్శి సంపంగి పద్మక్క ఒక ప్రకటనలో పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేసారు. నిన్న రైతు కూలి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సుద్దపల్లి సుధాకర్, శ్రీకాంత్ ఇతరులను సిరిసిల్ల పోలీసులు అదుపులోకి తెసుకున్నారని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులు ,మానసిక మనోవేదనకు, భయాందోళనకు గురి అవుతున్నారని ,సుద్దపల్లి సుధాకర్, శ్రీకాంత్

## కర్నాటకలో బీజేపీ మహిళా కార్యకర్తపై పోలీసులు దురుసు

**-కస్టడీలోకి తీసుకున్న సమయంలో ఆమెపై దాడి చేసి దుస్తులు చింపేశారు**

బెంగుళూరు జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కర్నాటకలో బీజేపీ మహిళా కార్యకర్తపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. కస్టడీలోకి తీసుకున్న సమయంలో ఆమెపై దాడి చేసి దుస్తులు చింపేశారు. ఈ ఘటన హుబ్లీలో జరిగింది. కాంగ్రెస్ కార్పొరేటర్ సువర్ణ కల్లకుంట్ల ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆ మహిళను కస్టడీలోకి తీసుకు న్నా రు. కేశ్వాపూర్ రాణాలో చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియ సమయం లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఘర్షణ జరిగింది.

ఈ నేపథ్యంలో ధర్నా చేపట్టిన బీజేపీని అడ్డుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఆ టైంలో ఓ బీజేపీ కార్యకర్త దాన్ని అడ్డుకున్నది. అభ్యంతరం వ్యక్తం చేసింది. తిరగబడ్డ ఆ కార్యకర్తపై దాడి చేశారు. ఆ పెనుగులాటలో ఆమె దుస్తులు చినిగిపోయాయి. ఆ మహిళా కార్యకర్త గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసింది. ఇటీవల ఆమె బీజేపీలో చేరింది. ఓటర్ల జాబితా నుంచి కొందరి పేర్లను తొలగించే అంశంలో అధికారులకు ఆ మహిళ సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తమ ప్రవర్తనపై పోలీసులు ప్రకటన చేయాల్సి ఉన్నది. ఈ ఘటన తర్వాత అక్కడ రాజకీయ ఉద్రిక్తత నెలకొన్నది. రెండు పార్టీలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నాయి.

## భవిష్యత్తులో నేను, నా కుటుంబ సభ్యులు ఎన్నికల్లో పోటీ చేయబోము

**-స్పష్టం చేసిన కైకలూరు బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్**

కైకలూరు జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కైకలూరు బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల నుంచి ఎప్పుడో విరమించుకోవాలనుకున్నా అని తెలిపారు. కానీ అందరూ కోరుకోవడంతో 2024లో పోటీచేశానని వెల్లడించారు. ఎన్నికల్లో ఊహించని మెజారిటీ తనకు వచ్చిందని చెప్పారు.

# ఏబివిపి సికింద్రాబాద్ పీజీ కాలేజ్ ప్రెసిడెంట్‌గా అభినయ్ యాదవ్




హైదరాబాద్ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏబివిపి సికింద్రాబాద్ పీజీ కాలేజ్ ప్రెసిడెంట్ గా అభినయ్ యాదవ్ నియమితులైనారు. పీజీ కళాశాల నూతన కమిటీని హైదరాబాద్ మహానగర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నరేందర్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏబివిపి జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్ మాట్లాడుతూ బ్రిటిష్ వారు మన భారతదేశాన్ని 200 సంవత్సరాలు పరిపాలించి మనదేశంలోని నలంద తక్షశిలా వంటి విశ్వవిద్యాలయాలను, అక్కడున్న గ్రంథాలను తగలబెట్టేసి దేశం నుండి బంగారం ఖనిజాలు మరియు అనేకమైనటువంటి వాటిని దోచుకు వెళ్లారు కానీ మన వేదన్నను మాత్రం దోచుకొలేకపోయారు మరియు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థ అయిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, విద్యార్థుల కోసం విద్యార్థుల సమస్యల పట్ల నిరంతరంగా సమాజంలో ఉంటూ నైతిక విలువలు కలిగిన సమాజాన్ని నిర్మించాలని ఆలోచనతో ఉన్నతమైన విద్యార్థులను తయారు చేయడం లక్ష్యంగా సమాజంలో పనిచేస్తుం దన్నారు. అనంతరం హైదరాబాద్ మహానగర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసి ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కాలేజ్ లో ఉన్నటువంటి విద్యార్థి సమస్యలు కళాశాల సమస్యలపై దృష్టిసారించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ నైతిక విలువలు కలిగిన సమాజంలో మీ వంతు పాత్ర పోషించాలని కోరుకున్నారు. మారేడు పల్లి టౌన్ ప్రెసిడెంట్ డా:మల్లారెడ్డి డా:రవి , సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క బాలకృష్ణ, హైదరాబాద్ మహానగర ఎస్ఎఫ్డి కన్వీనర్ పాండు రంగ్ గారు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లావణ్య,శ్రీరామ్,బేగంపేట్ టౌన్ సెక్రటరీ పవన్,మారేడు పల్లి టౌన్ సెక్రటరీ కృష్ణ,డి.విజయ్ కుమార్, విక్రమ్,విజయ్, గణేష్, రవి, శ్రీకాంత్, దుర్గేష్, మనోజ్,రామ్, శ్రీకర్, అజయ్, భాను, పృథ్వి, రమన్, అబ్బు ఫారహాన్, చెన్నాయా, రవి,అమర్నాధ్, సాయి కుమార్,జ్యోతి రాజ్, మణిదీప్, కావ్య, జాన్సీ, పరశురామ్, రాఘవేంద్ర, అంజలి, నింకాంత్,ఐశ్వర్య, కీర్తన, నవ్యశ్రీ, నవ్య, మాధవి, నీతిష, శివప్రియా, ప్రణీత్, మరియు కార్యకర్తలు, విద్యార్థి నాయకులు,తదితర విద్యార్థులు పాల్గొన్నారు...

# దేశంలో సమగ్ర, బాధ్యతాయుతమైన ఏఐ దార్శనికతను ముందుకు తీసుకెళ్లే

# ప్రాంతీయ కృత్రిమ మేధ ప్రభావ సమావేశాన్ని నిర్వహించిన రాజస్థాన్

న్యూఢిల్లీ, జనవరి 8: రాజస్థాన్ ప్రాంతీయ కృత్రిమ మేధ ప్రభావ సదస్సును 2026 జనవరి 6న నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర స్థాయి నాయకులు, విధాన నిర్ణేతలు, పారిశ్రామిక వేత్తలు, అంకుర సంస్థలు, విద్యావేత్తలు పాల్గొని.. పాలన, మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణ, శ్రామిక శక్తి అభివృద్ధి కృత్రిమ మేధ తీసుకొచ్చే మార్పులపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమాన్ని 2026 ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు జరగనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ (భారత కృత్రిమ మేధ ప్రభావ సదస్సు) 2026' కు సన్నాహకంగా ఏర్పాటు చేశారు.

ఈ సదస్సులో రాజస్థాన్ ముఖ్యమంత్రి శ్రీ భజన్ లాల్ శర్మ, కేంద్ర ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ (వర్చువల్‌గా), ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద, రాజస్థాన్ ఐటీ, కమ్యూనికేషన్ మంత్రి కర్నల్ రాజ్యవర్ధన్ రాథోడ్ పాల్గొన్నారు. వీరితోపాటు ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ వాఖ, రాజస్థాన్ ప్రభుత్వానికి చెందిన సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు. ఇది భారతీయ కృత్రిమ మేధ ఆధారిత అభివృద్ధి ప్రయాణంలో రాజస్థాన్‌ను కీలక భాగస్వామిగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య బలమైన సహకారాన్ని ప్రతిబింబిస్తుంది.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. “పారిశ్రామిక విప్లవం తీసుకువచ్చిన మార్పు, విద్యుత్, కంప్యూటర్లు, సెమీకండక్టర్లు, ఇంటర్నెట్, మొబైల్ సాంకేతికలు ప్రపంచాన్ని ఏ స్థాయిలో మార్చాయో, అదే స్థాయిలో ఇప్పుడు కృత్రిమ మేధ కూడా విప్లవాత్మక మార్పును తీసుకురాబోతుంది. సాంకేతికతను ప్రజాస్వామ్యీకరించాలనే స్పష్టమైన లక్ష్యం ప్రధానమంత్రికి ఉంది. దీని ద్వారా కృత్రిమ మేధ ఆధారిత విజ్ఞానం కొద్ది మందికే పరిమితం కాకుండా, ప్రతి వ్యక్తికి, ప్రతి కుటుంబానికి, ప్రతి సంస్థకు చేరాలనేదే ఆయన లక్ష్యం. ఇందుకు అనుగుణంగా నేడు కృత్రిమ మేధ నైపుణ్యాల్లో 10 లక్షల మంది యువతకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించాం. దీని ద్వారా భారత యువత ఈ కొత్త సాంకేతిక యుగానికి పూర్తిగా సిద్ధమవుతుంది” అని పేర్కొన్నారు.

కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద మాట్లాడుతూ.. “సాంకేతికత అందరికీ అందుబాటులో ఉండాలని (ప్రజాస్వామీకరణ) ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృఢంగా విశ్వసిస్తున్నారు. ఈ దార్శనికతతో వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పర్యావరణం వంటి విభిన్న రంగాలలో కృత్రిమ మేధ వినియోగాన్ని విస్తరించేందుకు 'ఇండియా ఏఐ మిషన్' కింద ప్రభుత్వం రూ. 10,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉంది. బాధ్యతాయుతమైన, సమగ్ర కృత్రిమ మేధ వినియోగం ద్వారా పౌరుల ఆదాయాలను పెంచడం, జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడం, దేశవ్యాప్తంగా ఉత్పాదకతను పెంపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం” అని ఆయన తెలిపారు.

రాజస్థాన్ ముఖ్యమంత్రి శ్రీ భజన్ లాల్ శర్మ మాట్లాడుతూ.. “నేడు రాజస్థాన్ ఈ-గవర్నెన్స్, సమ్మిళితత్వాన్ని దాటి ముందుకు సాగుతోంది. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ రంగాల్లో అగ్రగామిగా ఎదగడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటోంది. కృత్రిమ మేధ మన దేశ ప్రయాణంలో తదుపరి కీలక దశను సూచిస్తుంది. ఈ దిశగా మరింత ముందుకు సాగుతూ, మేం ఏఐ, ఎంఎల్ విధానాన్ని ప్రవేశపెట్టాం. ఈ విధానం ద్వారా కృత్రిమ మేధ వ్యవస్థలు మరింత పారదర్శకంగా, న్యాయంగా, నైతికత సమగ్రత సూత్రాలకు బాధ్యతయుతంగా మారేలా చేస్తుంది. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ వినయోగం ద్వారా ప్రజా సేవల అందజేతను మరింత వేగంగా, పారదర్శకంగా, పౌర కేంద్రీకృతంగా చేయవచ్చు. ఇది పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తుంది” అని తెలిపారు.

జాతీయ, రాష్ట్ర స్థాయి కృత్రిమ మేధ కార్యక్రమాలను ప్రకటించడం, ప్రారంభించడం ఈ సమావేశంలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇవి ఏఐ నేతృత్వంలోని ఆవిష్కరణలు, పాలనలో రాజస్థాన్‌ను ఒక కీలక కేంద్రంగా నిలబెట్టే దిశగా దోహదపడతాయి. సంబంధిత కార్యక్రమాలు కింది విధంగా ఉన్నాయి.

“యువ ఏఐ ఫర్ ఆల్”... మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇండియా ఏఐ మిషన్ నిర్వహిస్తున్న ఈ జాతీయ ఏఐ అక్షరాస్యత కార్యక్రమం కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమం. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువతలో ప్రాథమిక కృత్రిమ మేధ అవగాహనను పెంపొందించడమే దీని లక్ష్యం. జాతీయ యువజన దినోత్సవం (జనవరి 12) సందర్భంగా నిర్వహించే ఈ ప్రచారం.. లక్షలాది మంది విద్యార్థులు స్వయంగా నేర్చుకునే విధంగా రూపొందించిన లఘు ఏఐ (ఏఐ 101) కోర్సును పూర్తి చేసేలా వారిని ప్రోత్సహిస్తుంది. వికసిత్ భారత్ దార్శనికతకు, సమ్మిళిత, ప్రజాస్వామ్య ఏఐ స్వీకరణకు అనుగుణంగా దేశవ్యాప్తంగా సమిష్టి కృత్రిమ మేధ అభ్యాస ఉద్యమాన్ని సృష్టించడమే దీని లక్ష్యం

రాష్ట్రంలో పాలనను బలోపేతం చేయడం, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, అత్యున్నత స్థాయి ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా రాజస్థాన్ ఏఐ/ఎంఎల్ విధానం 2026 ను ప్రారంభించారు. దీని ప్రారంభానంతరం రాజస్థాన్ ఏఐ పోర్టల్ ను కూడా ఆవిష్కరించారు.

రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఐస్టార్ట్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎల్ఎంఎస్) ను ప్రారంభించారు.

రాజస్థాన్ ఏవీజీసీ-ఎక్స్ ఆర్ వేదిక.. రాష్ట్రంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, విస్తరించిన రియాలిటీ రంగాలను బలోపేతం చేయడం లక్ష్యంగా రాజస్థాన్ ఏవీజీసీ-ఎక్స్ ఆర్ వేదికను ప్రారంభించారు. దేశీయ, రాజస్థాన్ ఏఐ దృక్పథాన్ని ప్రతిబింబించే ఏఐ నేపథ్య వీడియోను కూడా విడుదల చేశారు.

సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేస్తూ ఈ కార్యక్రమంలో ఏఐ పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, నైతిక రూపకల్పనలు, ఆవిష్కరణ వ్యవస్థలను ముందుకు తీసుకెళ్లేందుకు గూగుల్, ఐఐటీ ఢిల్లీ, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, జోధ్‌పూర్, స్కిల్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ (వాధ్వానీ ఫౌండేషన్) తో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

ప్రైమస్ పార్ట్‌నర్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సమీర్ జైన్ నేతృత్వంలో ఇండియా ఏఐ మిషన్ సీఈఓ, మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి, ఎన్ఐసీ డీజీ శ్రీ అభిషేక్ సింగ్, ఎన్ వీఐడీఐఏ దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ విశాల్ ధూపర్ ఉన్నత స్థాయి వ్యూహాత్మక సమావేశం నిర్వహించారు. ఈ చర్చలో ఏఐ మౌలిక సదుపాయాలను ప్రజాస్వామ్యీకరించడం, ప్రభుత్వ-ప్రైవేటు సహకారాన్ని బలోపేతం చేయడం, విస్తృత స్థాయిలో ఆవిష్కరణలను ప్రారంభించడం, బాధ్యతాయుతమైన, విశ్వసనీయ ఏఐ కోసం ప్రభుత్వ రంగ సామర్థ్యాన్ని పెంపొందిస్తూ.. ప్రపంచ భద్రతా సామాజిక వేదిక నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలను విశ్లేషించారు.

ఇండియా ఏఐ మిషన్, ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 వివరాలు, ప్రాధాన్య తలను ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి త్వశాఖ శాస్త్రవేత్త, ఇండియా ఏఐ మిషన్ ప్రధాన కార్యనిర్వహణాధికారి శ్రీమతి కవితా భాటియా వివరించారు.

ఈ సదస్సులో “ ప్రపంచ ఏఐ, జాతీయ ఏఐ, ప్రాంతీయ ఏఐపై దృక్పథం” అనే అంశంపై ఒక కార్యక్రమం నిర్వహించారు. దీనిని ఐఐటీ జోధ్‌పూర్ ప్రొఫెసర్ శ్రీ అవినాష్ శర్మ అందించారు. ఈ సమావేశంలో ప్రాంతీయ పరిశోధనా సంస్థలు ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన, సందర్భోచిత ఏఐ పరిష్కారాలను రూపొందించడంలో ఎలా కీలక పాత్ర పోషిస్తాయో వివరించారు.

పాలన, మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, నైతికత, ఉపాధిలో వంటి రంగాల్లో ఏఐ వాస్తవ ప్రపంచ అనువర్తనాలపై నిపుణులు చర్చలు జరిపారు

‘ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 ముందు రాజస్థాన్ ప్రాంతీయ సదస్సు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ప్రజా శ్రేయస్సు, సమగ్ర వృద్ధి, అన్ని ప్రాంతాలలో స్థిరమైన అభివృద్ధి కోసం కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించాలనే దేశ నిబద్ధతను బలోపేతం చేసింది.

# హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం

**-ప్రియురాలు ఆత్మహత్య చేసుకోవడంతో తట్టుకోలేక పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని చనిపోయిన ప్రియుడు**

రంగారెడ్డి జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రియురాలు ఆత్మహత్య చేసుకోవడంతో ప్రియుడు తట్టుకోలేక పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని చనిపోయాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన పూజ(17), మహేశ్(20) గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం యువతి తల్లికి తెలియడంతో కూతురుతో పాటు మహేశ్ మందలించింది. తల్లి చెప్పిన విధంగా కూతురు నడుచుకుంటుంది. అమ్మాయి తాతకు మహేష్ ఫోన్ చేయడంతో ఆమె లిఫ్ట్ చేసింది. తనని ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని లేకపోతే చనిపోతాయనని యువతిని బెదిరించాడు. ఈ విషయం పూజ తన తల్లి అలివేలుకు చెప్పడంతో మంగళవారం ఉదయం లేచేసరికి యువతి దూలానికి ఉరేసుకుంది. మహేశ్ వేధించడంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని పోలీసుల కు ఫిర్యాదు చేసింది. ప్రియురాలు ఆత్మహత్య చేసుకోవడంతో మహేష్‌కు తెలియడంతో మానసిక వేదనకు గురయ్యాడు. బుధవారం ఉదయం బ్రహ్మణపల్లి శివారులో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని మహేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు నెలల క్రితం మహేష్, పూజ ఇద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు సమాచారం.

# రాష్ట్రంలో రాజకీయ శూన్యత లేదు, కాబట్టి కొత్త పార్టీలకు మనుగడ కష్టమే..

**-రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

హైదరాబాద్ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్రంలో రాజకీయ శూన్యత లేదు, కాబట్టి కొత్త పార్టీలకు మనుగడ కష్టమే..” అని రాష్ట్ర శాసనమండలి (కౌన్సిల్) చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కె. కవిత స్వయంగా వచ్చి తన ఎమ్మెల్యే పదవికి చేసిన రాజీనామాను ఆమోదించాల్సిందిగా కోరడంతో ఆమోదించానని ఆయన బుధవారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ అన్నారు. అంతకు ముందు ఆమె స్వయంగా రాజీనామా లేఖ అందించకుండా వ్యక్తిగత కార్యదర్శి (పిఏ) ద్వారా పంపించినందున ఆమోదించలేదని ఆయన చెప్పారు. భావోద్వేగంతో తీసుకున్న నిర్ణయం అని భావించి కొంత సమయం ఇవ్వడం సర్వసాధారణంగా చేస్తుంటామని ఆయన తెలిపారు. చట్ట సభల్లో ఎక్కడైనా సభ్యుడు రాజీనామా చేసినప్పుడు ప్రసంగించేందుకు అనుమతించాలని కోరితే ఇవ్వడం సంప్రదాయంగా ఉందన్నారు. కవిత కోరిక మేరకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చానని ఆయన తెలిపారు. కవిత పార్టీ పెట్టబోతున్నట్లు జరుగుతున్న ప్రచారం గురించి ప్రశ్నించగా, రాష్ట్రంలో రాజకీయ శూన్యత లేదు కాబట్టి కొత్త పార్టీలకు మనుగడ కష్టమేనని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్నో పార్టీలు వచ్చాయి, ఆ వెంటనే కొంత కాలానికి అవి కనుమరుగయ్యాయని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల గురించి ప్రశ్నించగా, సాధారణంగా అధికార పార్టీకే ఎక్కువగా గెలుపొందే అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. కౌన్సిల్‌లో కవిత కుటుంబ సభ్యుల గురించి చేసిన వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా, తాను స్పందించడం బాగుండదని, అవి ఆమె వ్యక్తిగతమైన వ్యాఖ్యలని అన్నారు.

# దృష్టిలోపం గల వారి కోసం ఆధునిక సదుపాయాలతో ప్రత్యేక శ్రవణ గ్రంథాలయం ప్రారంభం.

**-రాష్ట్రంలోనే జిల్లాలో మొట్టమొదటిది: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**

**-అంధులు సౌండ్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి:శాసనసభ్యులు చింతా ప్రభాకర్.**



సంగారెడ్డి, జనవరి 8: దృష్టిలోపం (విజువల్లీ ఛాలెంజ్డ్) గల వారికి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్య, సమాచారం సులభంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సంగారెడ్డి జిల్లాలో అంధుల శ్రవణ గ్రంథాలయం (సౌండ్ లైబ్రరీ) ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు.

మహిళా శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయంలో గురువారం అంధుల శ్రవణ గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, శాసనసభ్యులు చింతా ప్రభాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్యలతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సౌండ్ లైబ్రరీ ద్వారా దృష్టిలోపం గల వారు కంప్యూటర్ వినియోగం, పుస్తక పఠనం, ఇంటర్నెట్ బ్రౌజింగ్ వంటి కార్యకలాపాలను స్వయంగా నిర్వహించగలరని తెలిపారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సహాయంతో కంప్యూటర్‌ను పూర్తి స్థాయిలో ఆపరేట్ చేయడం, చదువు, అభ్యాసం, డాక్యుమెంట్ల వినియోగం వంటి పనులు సులభంగా చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఈ లైబ్రరీలో భారతీయ భాషల స్కాన్ అండ్ రీడ్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. దీని ద్వారా విజువల్లీ ఛాలెంజ్డ్ విద్యార్థులు ముద్రిత పుస్తకాలను నేరుగా స్కాన్ చేసి చదవగలరని చెప్పారు. ఆఫ్‌లైన్‌తో పాటు గూగుల్ ఏఐ ఆధారిత ఆన్‌లైన్ విధానాలు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు.

దృష్టిలోపం గల వారి వినియోగానికి అనుగుణంగా 10 ఏంజెల్ ప్లేయర్లు (డీజీ ప్లేయర్లు) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా స్కాన్ చేసిన పుస్తకాలు, ఎడిటబుల్ ఫైళ్లు, పీడీఎఫ్ ఫార్మాట్లో ఉన్న పుస్తకాలను కాపీ చేసి వినియోగించుకోవచ్చని, కంప్యూటర్ అవసరం లేకుండానే తెలుగు, హిందీతో తదితర భారతీయ భాషల పుస్తకాలను ఆడియో రూపంలో వినే సౌకర్యం ఉందని, భారతీయ యాసతో స్పష్టంగా చదివే విధానం ఈ లైబ్రరీ ప్రత్యేక ఆకర్షణగా ఉందన్నారు. అలాగే బ్రెయిలీ ప్రింటింగ్ సదుపాయం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంగ్లీష్ లేదా తెలుగు భాషల్లో ఉన్న పుస్తకాలను (పీడీఎఫ్, జేపీజీ లేదా ముద్రిత రూపంలో) బ్రెయిలీ లిపిలోకి మార్చి ముద్రించడం ద్వారా దృష్టిలోపం గల వారు బ్రెయిలీ లిపి ద్వారా పుస్తకాలను చదవగలరని వివరించారు.

ఈ సౌండ్ లైబ్రరీ దృష్టిలోపం గల విద్యార్థుల విద్యా పురోగతి, స్వావలంబనకు తోడ్పడటంతో పాటు ఆధునిక సాంకేతికతను వారికి మరింత దగ్గర చేస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.

శాసన సభ్యులు చింతా ప్రభాకర్ మాట్లాడుతూ, ఎక్కడా లేని విధంగా దృష్టిలోపం గల వారి కోసం జిల్లాలో శ్రవణ గ్రంథాలయం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. దివ్యాంగులు ఈ సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ ఆలోచన మేరకు ఈ సౌండ్ లైబ్రరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకున్నప్పుడే దీని సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో దివ్యాంగులు మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

అంతకు ముందు లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి వేడుకలు నిర్వహించి, ప్రత్యేక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వసుంధర, పంచాయతీ రాజ్ శాఖ డీఈ దీపక్, వివిధ దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, డీడబ్ల్యూఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండుగకు 6,431 ప్రత్యేక బస్సులు

**-ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూళ్లకు టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయం**

హైదరాబాద్ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. పండుగకు 6,431 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 9, 10, 12, 13 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో దానికి అనుగుణంగా ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ నెల 18, 19 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయినపల్లి , గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తుంది.సంక్రాంతి పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయని సంస్థ వెల్లడించింది. ఈ నెల 9, 10, 12,13 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 18, 19 తేదీల్లో మాత్రమే సవరించిన ఛార్జీలు అమల్లో ఉంటాయని, స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ ఛార్జీలే అమల్లో ఉంటాయని వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుందని వివరించింది. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను www.tgsrtcbus.in వెబ్ సైట్ లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-2 3450033 లలో సంప్రదించాలని సూచించింది.

# ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**-విద్యార్థి, యువజన నేతలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి**

**-ఏఐఎస్ఎఫ్-వైఎస్ఆర్ యూత్ ఫెడరేషన్ డిమాండ్**




చిత్తూరు, జనవరి 8:పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు రూ. 6,400 కోట్లను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థి, యువజన నాయకులపై పెట్టిన అక్రమ కేసులు, రౌడీషీట్లు, పీడీ యాక్టులను వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్, వైఎస్ఆర్ యూత్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు.

చిత్తూరు పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, వైఎస్ఆర్ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖపట్నంలో శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టిన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రౌడీషీట్లు తెరవడం, అనకాపల్లి రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై పీడీ యాక్ట్ నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి, కేజీబీవీలలో వసతుల మెరుగుదల, మెస్సు బిల్లుల పెంపు, పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్వహణ రద్దు, ఖాళీ పోస్టుల భర్తీ నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కల్పించాలంటూ డిమాండ్ చేశారు.

సమస్యలను పరిష్కరించమని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం సరైంది కాదని, అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలను కలుపుకుని ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ప్రవీణ్ కుమార్, వైఎస్ఆర్ యూత్ ఫెడరేషన్ నాయకులు మనోజ్ కుమార్ రెడ్డి, వసంత్, చరణ్, సంతోష్, శబరీస్ తదితరులు పాల్గొన్నారు.

# నదీ గర్భంలో నిర్మాణాలు కడుతున్నారని ప్రజల్ని వైసిపి తప్పుదోవ పట్టిస్తోంది

**- మంత్రి నారాయణ**

అమరావతి జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నదీ గర్భంలో నిర్మాణాలు కడుతున్నారని ప్రజల్ని వైసిపి తప్పుదోవ పట్టిస్తోందని మంత్రి నారాయణ తెలిపారు. నదీ గర్భంలో రాజాధాని కట్టడంలేదని, మాజీ సిఎం జగన్ హయాంలో కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 3 వేల కోట్లు ఇవ్వలేదని అన్నారు. జగన్ రాజధాని వ్యాఖ్యలపై నారాయణ కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బుధవారం నుంచి ల్యాండ్ పూలింగ్ ప్రారంభించామని, రాజధాని పనులకు బ్రేక్ వేసేందుకు వైసిపి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. లీగల్‌గా ఎలాంటి ఇష్యూ లేకుండా వర్క్ చేస్తున్నామని, వర్షాల వల్ల అమరావతి పనులు జరగలేదని తెలియజేశారు. టిడిపి అధికారంలోకి రాగానే అమరావతి పునర్నిర్మాణం చేపట్టామని, రాజధాని మాస్టర్ ప్లాన్ ఏంటి అనేదానిపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. రివర్ బెడ్ అంటే ఏంటి రివర్ బేస్ మెంట్ అంటే ఏంటనేది తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.

# భారత కోస్ట్ గార్డ్ నౌక (ఐసీజీఎస్) సముద్ర ప్రతాప్ జల ప్రవేశాన్ని స్వాగతించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 8:భారత కోస్ట్ గార్డ్ నౌక (ఐసీజీఎస్) సముద్ర ప్రతాప్ జల ప్రవేశం, భారత సముద్రయాన చరిత్రలో కీలక ఘట్టమని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కొనియాడారు. పలు కారణాల దృష్ట్యా కోస్ట్ గార్డ్ దళంలో ఈ నౌకను చేర్చటం ఎంతో విశేషమని చెప్పారు.

ఈ నౌక ప్రారంభం ద్వారా రక్షణ, సముద్ర రంగ సామర్థ్యాల్లో ఆత్మనిర్భర్ భారత్ విజన్ కు మరింత బలం చేకూరుతుందని ప్రధానమంత్రి అన్నారు. ఇది దేశ భద్రతా వ్యవస్థను బలపరచటమే కాక, తీరప్రాంత నిఘాను పెంచి, భారత సముద్ర ప్రయోజనాలను కాపాడుతుందని తెలిపారు. పర్యావరణహిత కార్యకలాపాల కోసం ఇందులో ఆధునిక సాంకేతికతను జోడించారని, ఇది సుస్థిరత పట్ల మనకున్న దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు.

సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చేసిన పోస్టుకు స్పందిస్తూ, శ్రీ నరేంద్ర మోదీ ఇలా పేర్కొన్నారు:

”పలు కారణాల రీత్యా భారత కోస్ట్ గార్డ్ నౌక (ఐసీజీఎస్) సముద్ర ప్రతాప్ ప్రారంభోత్సవం ప్రత్యేకమైనది. స్వావలంబన దిశగా మన ఆలోచనలకు ఇది బలాన్ని చేకూర్చటమే కాక, భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తుంది. పర్యావరణ పరిరక్షణకు మనం ఇస్తున్న ప్రాధాన్యతను ఈ నౌక స్పష్టం చేస్తుంది.

# ముస్సిపల్ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్

## వార్డువారీ ఓటర్ల తుది జాబితా ప్రచురణకు సూచనలు

## – రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీకుమిది




సంగారెడ్డి, జనవరి 8 (నేటి నిజం ప్రతినిధి) మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీకుమిది బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, తెలంగాణ మున్సిపాలిటీ చట్టం–2019లోని సవరించిన సెక్షన్ 195–ఎ ప్రకారం వార్డువారీ ఓటర్ల తుది జాబితాను ఈ నెల 12 న తప్పనిసరిగా ప్రచురించాలని సూచించారు.

ఈ నెల 13వ తేదీన పోలింగ్ స్టేషన్ల వివరాల ముసాయిదా జాబితాను ప్రచురించి, వాటిని 'టి–పోల్'లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా ఈ నెల 16న పోలింగ్ స్టేషన్ల వివరాలతో పాటు ఫోటోతో కూడిన ఓటర్ల తుది జాబితాను ఆయా వార్డులలోని పోలింగ్ స్టేషన్ల వద్ద స్పష్టంగా ప్రచురించాలని తెలిపారు.

పోలింగ్ నిర్వహణలో భాగంగా అవసరమైన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు, ఎఫ్ ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాల నియామకాన్ని వెంటనే పూర్తి చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా చేపట్టాలని కమిషనర్ సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పలు అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ఆయా విషయాలపై కమిషనర్ తగిన సూచనలు, మార్గదర్శకాలను అందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి అదనపు కలెక్టర్ పాండు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగపు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఏపి సిఎం చంద్రబాబుకు రహస్య ఒప్పందం

## –చంద్రబాబు స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను తాకట్టు పెట్టారు: జగన్



అమరావతి జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: స్వలాభం కోసం ఏపి సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఎంతటి ద్రోహమైనా చేస్తారని మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. రాయలసీమకు, నెల్లూరుకు ఆ ప్రాజెక్టు సంజీవని వంటిదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఏపి సిఎం చంద్రబాబుకు రహస్య ఒప్పందం ఉందని తెలుస్తోందని, చంద్రబాబు స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను తాకట్టు పెట్టారని విమర్శించారు. 800 అడుగులలోపే 2 టిఎంసిల నీళ్లు తీసుకునేలా తెలంగాణలో పాలమూరు– రంగారెడ్డి మొదలు పెట్టారని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వెనుక గొప్ప ఆలోచన ఉందన్నారు. శ్రీశైలం నుంచి రోజుకు 8 టిఎంసిలు నీళ్లు అవుతుంటే ప్రాజెక్టు ఎప్పుడు నిండుతుందని, కిందున్న రాయలసీమ, నెల్లూరు పరిస్థితి ఏంటి? అని, ఈ విషయంలో చంద్రబాబు ఏ రోజైనా ఆలోచన చేశారా? అని జగన్ ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడుకు 101 టిఎంసిల కేటాయింపు ఉన్నాయని, కానీ..20 ఏళ్లలో రెండు, మూడు సార్లే ఆ నీటిని తీసుకున్నామని గుర్తు చేశారు. ఇలాంటి చరిత్ర హీనులు దేశంలో ఉండరని విమర్శించారు. రాయలసీమ లిఫ్ట్ అవసరం లేదని మాట్లాడుతున్నారని, చంద్రబాబు మౌనం వల్ల శ్రీశైలం భాగంలో తెలంగాణ ప్రాజెక్టులు చేపట్టిందని తెలియజేశారు. ఎస్ఎల్‌బిసి 45 టిఎంసిలు తరలించేలా పనులు చేస్తున్నారని, 777 అడుగుల నుంచే ఎడమవైపు పవర్ హౌస్ ద్వారా 4టిఎంసి నీళ్లను తెలంగాణ ఖాళీ చేస్తోందని పేర్కొన్నారు. నీళ్లు లేకుండా మనం ఇబ్బందులు పడుతున్నామని, రాష్ట్రానికి, రాయలసీమ ప్రయోజనానికి విఘాతం కలిగించేలా చంద్రబాబు నిర్ణయాలు ఉన్నాయని మండిపడ్డారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన చంద్రబాబు నోరు మెదపడం లేదని ధ్వజమెత్తారు. రాయలసీమ లిఫ్ట్ వాస్తవాలు అందరికీ తెలియాలని, రాయలసీమ లిఫ్ట్ ను ఆపించాలని తెలంగాణ సిఎం ప్రకటించారని తెలియజేశారు. ఈ పరిస్థితిని చక్కబెట్టడం కోసం వైఎస్ హయాంలో చర్యలు తీసుకున్నామని, 800 అడుగుల్లోనే 3 టిఎంసిలు తీసుకునేలా రాయలసీమ ఎత్తిపోతల చేపట్టామని అన్నారు. అక్కడ కట్టింది రిజర్వాయర్ కాదు.. స్టెబిలైజింగ్ రిజర్వాయర్ అని ఏపి ప్రజలకు నష్టం జరగకుండా చూడాల్సిన ధర్మం తమకు ఉందని జగన్ పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు పేరుతో క్రెడిట్ చోరీ చేస్తున్నారని, ఎయిర్ పోర్టు పేరుతో భూ దోపిడీకి పాల్పడాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ హయాంలో భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు వేగంగా జరగాలని చూశామని, మొదటి 15 వేల ఎకరా లని..తర్వాత 5 వేల ఎకరాలు కావాలన్నారని అన్నారు. 2,700 ఎకరాల భూసేకరణను తమ ప్రభుత్వంలోనే పూర్తి చేశామని, మూడు గ్రామాల్లో 400 కుటుంబాలను తరలించామని అన్నారు. కేంద్రమంత్రి గడ్కరీ భోగాపురం తమ డ్రీమ్ ప్రాజెక్టు అని చెప్పారని, చంద్రబాబు, సివిల్ ఏవియేషన్ మంత్రి.. క్రెడిట్ చోరీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి హయాంలో పరిశ్రమలు, పారిశ్రా మికవేత్తలు వెళ్లిపోయారని దుష్ప్రచారం చేస్తున్నా రని, నిజాలు బయటకు వచ్చేలోపు చంద్రబాబు అబద్ధాలు ప్రపంచాన్ని చుట్టేస్తున్నాయని అన్నారు. తమ హ యాంలో తయారీ రంగంలో దేశంలోనే ఏపి ఐదో స్థానంలో ఉందని, చంద్రబాబు తప్పుడు ప్రచారా లను బద్ధలు చేస్తూ ఆర్ బిఐ నివేదిక ఇచ్చిందని తెలిపారు.

# వివేకానందుడి వారసులుగా రుజువు చేసుకుందాం

## –లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్




హైదరాబాద్, జనవరి 8: నేటి భారత యువత నైపుణ్య విజ్ఞాన వివేకాలను పెంపొందించుకుంటూ లక్ష్యాన్ని సాధన దిశగా ముందుకు సాగితే భవ్యమైన భవిష్యత్తును కలిగి స్వామి వివేకానందుడి అసలైన వారసులుగా నిలిచి పోతామని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, విశ్రాంత ఆచార్యులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు ప్రభుత్వ ఓల్డ్ హైస్కూల్ విద్యార్థులతో శాతవాహన లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పేదరికం చదువుకు ప్రతిబంధకం కాదని, దాని వల్ల మనలో మానసిక పట్టుదల, ఎదగాలనే కసి పెరగాలని అన్నారు. క్రమశిక్షణతో కూడిన దినచర్యను ఆచరించిన యువత లక్ష్యాలను సగర్వంగా ముద్దాడతారని తెలిపారు. పాఠశాలలో శ్రద్ధగా వినడం, ఇంటి వద్ద నిత్యం 3 లేదా 4 గంటలు ఏకాగ్రతతో చదవడం, దేహ దారుఢ్యం కోసం ప్రతి రోజు కనీసం ఒక గంట క్రీడా మైదానంలో ఆడడం విధిగా పాటించాలని సూచించారు. తెలియని అంశాలను వెంటనే అడిగి అనుమానాలను నివృత్తి చేసుకోవడం అవసరం అని చెప్పారు.

శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ దాసరి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ వివేకానందుడి బోధనలు యువతకు ప్రేరణను ఇస్తున్నాయని, ఆయన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు శాతవాహన లయన్స్ క్లబ్ బాధ్యులు బహుమతులు ప్రదానం చేసారు. పాఠశాల హెచ్ఎం వసుంధర అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ గాండ్ల చంద్రశేఖర్ వందన సమర్పన చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి లయన్ పచ్చునూరి సురేందర్, ఉపాధ్యక్షులు లయన్ ఎం మహేందర్, లయన్ నార్ల వేణుగోపాల్, ఉపాధ్యాయులు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి విషయంలో రాష్ట్రాన్ని బిఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయి

## –కంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సాగునీటి విషయంలో రాష్ట్రాన్ని బిఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బిఆర్ఎస్ నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నదీ జలాల విషయంలో రాష్ట్ర వాటాను కాంగ్రెస్ వాడుకోలేదని, కృష్ణా జలాల అంశంలో ప్రజలను మాజీ సిఎం కెసిఆర్ పదేపదే మోసం చేశారని విమర్శించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి వాటాను పూర్తిగా వాడుకోలేదని, తెలంగాణకు నీటి అవసరం ఉన్నప్పటికీ వాడుకోలేదని తెలియజేశారు. కాంగ్రెస్, కెసిఆర్ చేసిన మోసాలు చూస్తే తనకు ఆశ్చర్యం వేసిందని, కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టిఎంసిలు రావాలని బండి సూచించారు. 571 టిఎంసిలు రావాల్సి ఉంటే.. 299 టిఎంసిలకే కెసిఆర్ ఒప్పుకున్నారని, 299 టిఎంసిలకు కెసిఆర్ ప్రభుత్వం ఎందుకు ఒప్పుకుంది? అని ప్రశ్నించారు. రూ. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం పరిస్థితి ఏమైందని అందరికీ తెలిసిందేనని అన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక పాలమూరు ప్రాజెక్టు పేరుతో దోపిడీకి తెరలేపారని, పాలమూరు ప్రాజెక్టులో కాలువల నిర్మాణం, లిఫ్టుల పేరుతో వ్యయం అంచనాలు పెంచారని విమర్శించారు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత బయట పడుతోందని, అక్రమాలను ఎవరు బయటపెట్టినా బిజెపి అండగా ఉంటుందని బండి సంజయ్ పేర్కొన్నారు.

# ప్రధానమంత్రి అధ్యక్షతన భారతీయ ఏఐ అంకుర సంస్థల రౌండ్ టేబుల్ సమావేశం

న్యూఢిల్లీ, జనవరి 8:లోక కల్యాణ్ మార్గ్, 7 లోని తన నివాసంలో ఈ రోజు జరిగిన ఏఐ అంకుర సంస్థల రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత వహించారు.

వచ్చే నెలలో నిర్వహించే 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు–2026'కు ముందు ఈ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనిలో 'ఏఐ ఫర్ ఆల్: గ్లోబల్ ఇంపాక్ట్ ఛాలెంజ్'లో పాల్గొనేందుకు ఎంపికైన 12 భారతీయ ఏఐ అంకుర సంస్థలు పాల్గొని, తమ ఆలోచనలను, చేస్తున్న కృషిని పంచుకున్నాయి.

ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన అంకుర సంస్థలు పాల్గొన్నాయి. వాటిలో భారతీయ భాషా విధానాలు, బహుళ భాషా ఎల్ఎల్ఎంలు, స్పీచ్–టు–టెక్స్ట్, టెక్స్ట్– టు–ఆడియో, టెక్స్ట్–టు–వీడియో, ఈ–కామర్స్, మార్కెటింగ్, వ్యక్తిగతీకరించిన కంటెంట్ రూపకల్పనలో జనరేటివ్ ఏఐను ఉపయోగించి రూపొందించే 3డీ కంటెంట్, ఇంజినీరింగ్ సిమ్యులేషన్లు, మెటీరియల్ పరిశోధన, పరిశ్రమల్లో సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి అధునాతన విశ్లేషణలు, ఆరోగ్య పరీక్షలు, వైద్య పరిశోధన, తదితర రంగాలకు చెందిన సంస్థలు ఉన్నాయి.

దేశంలో కృత్రిమ మేధ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంలో భారత్ కనబరుస్తున్న చిత్తశుద్ధిని ఏఐ అంకుర సంస్థలు ప్రశంసించాయి. ఏఐ రంగం వేగంగా సాధిస్తున్న పురోగతిని, దీనికి ఉన్న అపారమైన భవిష్యత్తు సామర్థ్యాన్ని వారు వివరించారు. అలాగే కృత్రిమ మేధ ఆవిష్కరణ, విస్తరణలకు భారత్ ఆకర్షణ కేంద్రంగా మారుతోందని చెప్పారు. ఏఐ అభివృద్ధికి అవసరమైన బలమైన, అనుకూలమైన వాతావరణాన్ని భారత్ అందిస్తోందని, ఇది ప్రపంచ ఏఐ రంగంలో దేశ స్థానాన్ని సుస్థిరం చేసిందని పేర్కొన్నారు.

సమాజంలో మార్పులు తీసుకురావడంలో కృత్రిమ మేధకున్న ప్రాధాన్యాన్ని ఈ సమావేశంలో ప్రధానమంత్రి వివరించారు. వచ్చే నెలలో ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు భారత్ ఆతిథ్యమిస్తోందని, దీని ద్వారా సాంకేతిక రంగంలో దేశం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఏఐను ఉపయోగించుకొని మార్పులను తీసుకొచ్చే ప్రయత్నాలను భారత్ చేపడుతోందని ఆయన వివరించారు.

భారత భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంకుర సంస్థలు, ఏఐ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సహనిర్మాతలని ప్రధానమంత్రి అన్నారు. ఆవిష్కరణలు చేయడంలో, పెద్ద స్థాయిలో అమలు చేయడంలో దేశానికి అపారమైన సామర్థ్యం ఉందని చెప్పారు. "మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఫర్ ది వరల్డ్" స్ఫూర్తిని ప్రతిబింబించేలా ప్రత్యేకమైన ఏఐ నమూనాను ప్రపంచానికి భారత దేశం అందించాలని అన్నారు.

భారత దేశంపై ప్రపంచానికున్న నమ్మకమే దేశానికి అతి పెద్ద బలమని ప్రధానమంత్రి అన్నారు. భారతీయ ఏఐ నమూనాలు నైతికంగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా.. సమాచార గోప్యతా నియమాల ఆధారంగా ఉండాలని సూచించారు. భారత్ నుంచి అంతర్జాతీయ నాయకత్వం వహించేలా అంకుర సంస్థలు పనిచేయాలని ఆయన అన్నారు. అలాగే అంతర్జాతీయంగా సరసమైన, సమగ్రమైన ఏఐ, తక్కువ ఖర్చుతో ఆవిష్కరణలను భారత్ ప్రోత్సహించగలదన్నారు. భారతీయ ఏఐ నమూనాలు ప్రత్యేకమైనవిగా, స్థానిక, దేశీయ కంటెంట్‌ను, ప్రాంతీయ భాషలను ప్రోత్సహించేలా ఉండాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమానికి అవతార్, భారత్ జెన్, ఫ్రాక్టల్, గాన్, జెన్‌లూప్, జ్ఞాని, ఇంటెల్లిహెల్త్, సర్వం, శోధ్ ఏఐ, సాకెట్ ఏఐ, టెక్ మహీంద్ర, జెన్‌టీక్ సహా భారతీయ ఏఐ అంకుర సంస్థల సీఈవోలు, అధిపతులు, ప్రతినిధులు హాజరయ్యారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్, సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రెండేళ్లలో వేయికోట్లతో అభివృద్ధి

## –విద్య, వైద్యానికి పెద్దపీట



వరంగల్,జనవరి 8: నాగర్ కర్నూల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, గత రెండేళ్లలో దాదాపు వేయి కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

పట్టణంలో ఎండబెట్ల వద్ద హై లెవల్ బ్రిడ్జికి 10కోట్లు, సీసీ రోడ్లకు రూ. 20కోట్ల, బస్టాండుకు 12కోట్లు, సిర్సవాడ బ్రిడ్జికి 20కోట్లు, యంగ్ ఇండియా స్కూల్ కు 200కోట్లు, వైద్య కళాశాల 200 కోట్లు, అసంపూర్తిగా ఉన్న మార్కండేయ రిజర్వాయర్ కు 25కోట్లు మంజూరు చేయించి ప్రారంభించామన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలు పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తానన్నారు.

అలాగే స్త్రీశక్తి భవన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలభవనం, అలాగే ప్రజల కోరిక మేరకు ఆర్టీఏ కార్యాలయం మార్చామన్నారు. ముస్లింల షాదీఖానా కోసం 3కోట్లకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు త్వరలో మంజూరు అవుతాయన్నారు. తెల్కపల్లికి డిగ్రీ కళాశాల మంజూరు అయ్యిందని అన్నారు. అన్ని మండలాల్లో అభివృద్ధి జరిగేలా చూస్తామన్నారు.

వివిధ అభివృద్ధి పనులకు 650 కోట్లు నిధులు రావడం జరిగింది అని, ప్రభుత్వ పథకంలు కలిపి ఈ రెండేళ్లలో నియోజకవర్గంలో దాదాపు వేయి కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో 55కోట్లతో సీసీ రోడ్లు, 25 కోట్లతో డ్రైనేజీ పనులు చేపట్టామని అన్నారు. పెద్ద ఎత్తున చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉందన్నా రు.

అలాగే ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం, పింఛన్లు లాంటి ప్రభుత్వ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు నాగర్ కర్నూల్ నుండి తరలిపోయిన బీసీ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను తిరిగి ఇక్కడికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విలేకరల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, ఆర్ టి ఏ మెంబెర్ గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వినోద్, కోటయ్య నిజాం శ్రీనివాసలు తదితరులు పాల్గొన్నారు.

# కారులో బాలికపై ఎస్ఐ, జర్నలిస్టు, యూట్యూబర్ రేప్

లక్నో జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మైనర్ బాలికను కారులో కిడ్నాప్ చేశారు. అనంతరం కారులో బాలికపై ఎస్ఐ, యూట్యూబర్, జర్నలిస్టు సామూహిక అత్యాచారం చేశారు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌లో జరిగింది. బాధితురాలు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... 14 ఏళ్ల బాలిక ఇంటి నుంచి సచేండి రైల్వే స్టేషన్ సమీపంలోకి వచ్చింది. కారులో ఇద్దరు వ్యక్తులు బాలికను కిడ్నాప్ చేశారు. వెంటనే ఆమె సోదరుడు గమనించి కుటుంబ సభ్యులకు చెప్పాడు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో చేశారు. పోలీసులు పట్టించుకోలేదు. కారులోనే బాలికపై ఎస్ఐ, జర్నలిస్టు, యూట్యూబర్ గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. రెండు గంటల తరువాత ఇంటికి సమీపంలో బాలికను వదిలేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా కావడంతో ఉన్నతాధికారి త్రిపాఠి వెంటనే స్పందించారు. నిందితులపై గ్యాంగ్ రేప్, పోక్సో యాక్టుతో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని తెలిపారు. జర్నలిస్ట్ శివభరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఎస్ఐ కూడా అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

# గద్వాల్ జిల్లాలో జౌళి శాఖ ఏడి గోవిందయ్య అరాచకాలు ...

## – జోగులంబ గద్వాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తట్టే మహేష్

హైదరాబాద్ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గద్వాల్ జిల్లాలో జౌళి శాఖ ఏడి గోవిందయ్య అరాచకాలు అంతా ఇంత కాదని, చేనేత కార్మికుల పాలిట శాపంగా మారారని జోగులంబ గద్వాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తట్టే మహేష్ ఆరోపించారు..హైదరాబాద్ లో ఆయన మీడియా సమావేశం లో మాట్లాడుతూగద్వాల జిల్లా అనగానే చేనేత రంగానికి ప్రత్యేక గుర్తింపు... అలాంటి జిల్లాలో చేనేత ఏడి గోవిందయ్య చేనేత కార్మికుల రక్తం తాగుతూ వారి కష్టాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు..కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను అభివృద్ధిపరిచే దిశగా అనేక పథకాలను ప్రవేశపెట్టిన లబ్ధి పొందాల్సిన వారు పైకం చెల్లించండి లబ్ధి పొందే పరిస్థితులు నేడు లేవు. కొత్త జియో ట్యాగులు నమోదు చేయాలన్న మన ఏడి గోవిందయ్య 3000 పైకం చెల్లించాల్సిందే.... నేత కార్మికుడు చనిపోతే ఆ కుటుంబానికి భరోసాని ఇవ్వాలని సంకల్పంతో చేనేత భీమా పథకాన్ని ప్రవేశపె డితే చనిపోయిన వారిపై కూడా ఐదు లక్షల బీమా రావాలంటే 50,000 పైకం తప్పదు... కుటుంబ సభ్యులకు ప్రభుత్వము అందించే సహకారాన్ని కూడా లంచం యొక్క మాత్రం తప్పడం లేదు.... త్రిఫ్ట్ పండు ద్వారా చేనేత కార్మికుల గ్రూపుగా ఏర్పడి ఆర్డి కట్టుకుని కుటుంబ ఆర్థిక వ్యవస్థ ను మెరుగుపరచుకోవడమే లక్ష్యం గా చేనేత కార్మికుడు కట్టిన నగదు కంటే రెండింతలు పెంచుతూ అందించే పథకం పేరుతో చేనేత కార్మికులకు పథకాన్ని అమలు చేస్తే ఆ వచ్చిన ఆర్డినగదు చెక్కు అందాలంటే కూడా 5000 రూపాయల నగదు తో చెయ్ తడపాల్సిందే నన్నారు. చేనేత కార్మికులకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్న జిల్లా కేంద్రంలో ఉన్న జౌళి శాఖ కేంద్రానికి వెళితే ఏడి గోవింద య్య అనే సంప్రదించాలంటే టేబుల్ కింద చేయి పెడుతూ చేతికి ఎంత వస్తే అంత ఇవ్వాల్సిందే అనే రూల్ తప్పనిసరి....చేనేత రుణమాఫీలో పేరు రాకపోతే ఆ పేరు చేర్చుటకు 5000 రూపాయలు ప్రత్యేకంగా తీసుకుంటూ చేనేత రుణమాఫీ లిస్టులో పేరు నమోదు చేస్తున్నారు ఈ ప్రక్రియ ఈయన స్వతహాగా పేర్లను తొలగిస్తూ, మీకు మాఫీ రాదని భయంతో ఐదు వేలు వసూలు చేసే ప్రక్రియను సహ ఉద్యోగులతో చేనేత కార్మికులతో లంచం తీసుకుంటున్నారు. నిన్న కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా నిలుస్తూ జాకెట్ మిషన్ పంపిణీ అమలు చేసిన దాని పంపిణీ చేయడం కూడా 100 రూపాయల వసూలు చేస్తున్నారు.... గద్వాల జిల్లాకు పేరు గాంచిన చేనేత కార్మికులకు కడుపు కొడుతూ వారి రక్తాన్ని తాగుతున్న చేనేత ఉన్నత అధికా రులు ఏడి గోవిందయ్య గారిపై చర్యలు మాత్రం శూన్య మన్నారు. జిల్లా కలెక్టర్ ఏడి గోవిందయ్య పై చర్యలు తీసుకోకుంటే ఆయన చేస్తున్న అరాచకాలపై చేనేత కార్మికులతో నిరసనలు తప్పవ ని....కలెక్టర్ చొరవతో ఏడి గోవిం దయ్య పై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి... లేదంటే పెద్ద ఎత్తున ధర్నా చేసే చూపేడ తామనీ జోగులాంబ గద్వాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్య క్షులు తట్టే మహేష్ హెచ్చరిం చారు. వవ సమావేశం లో కేకే యల్లప్ప మాస్టర్ వీ వర్స్ మరియు మైలే రమేష్ మోటార్ వైన్డింగ్ పాల్గొన్నారు.

# ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రణయ్ కుమార్

హైద్రాబాద్ జనవరి 8(ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా విద్యానగర్ విద్యార్థి మాధ ప్రణయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈనెల 3,4,5 తేదీల లో శంషాబాద్ లో జరిగిన 44వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షులు డా రావల కృష్ణ సార్ నూతన కార్యవ ర్గంను ప్రకటించగా,విద్యానగర్ నుండి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ప్రణయ్ కుమార్ ,అంజన్ ,మమత దక్కింది. ప్రణయ్ కుమార్ గతంలో మ్యారెడపల్లి మరియు ఖైరతాబాద్ నగర కార్యదర్శిగా, పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తమ పై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యవర్గం లో అవకాశం కల్పించిన రాష్ట్ర శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# భారత్‌లో శాశ్వత సాంస్కృతిక చేతనపై వచ్చిన వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 8:కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో పంచుకున్నారు.

భారత చిరకాలిక సాంస్కృతిక చేతనకు సోమనాథ్ దేవాలయం ప్రతీకగా ఉందని శ్రీ మోదీ అన్నారు. ఇది గత 11 సంవత్సరాలుగా సోమనాథ్ మొదలు రామ జన్మభూమి వరకూ చోటుచేసుకున్న మార్పును ప్రస్ఫుటం చేస్తోందనీ, భారత్ తన సాంస్కృతిక గుర్తింపు పట్ల గర్విస్తున్న దేశంగా మారడాన్ని ప్రతిబింబిస్తోందనీ ఆయన అన్నారు.

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రధానమంత్రి ఆ వ్యాసాన్ని ప్రజలతో పంచుకుం టూ –

"సోమనాథ్ దేవాలయం భారత శాశ్వత సాంస్కృతిక చేతనకు ప్రతీకగా ఉంది. గడచిన 11 సంవత్సరాల్లో సోమనాథ్ మొదలు రామ జన్మభూమి వరకూ చోటు చేసుకున్న మార్పు... భారత్ ఇప్పుడు తన సాంస్కృతిక గుర్తింపును చూసుకొని గర్విస్తున్న, ఆత్మవిశ్వాసం ఉట్టిపడుతున్న పరిపూర్ణ దేశంగా రూపొందిందనడానికి ఒక నిదర్శనంగా ఉంది. ఈ విషయంపై కేంద్ర మంత్రి గారు తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.." అని పేర్కొన్నారు.

# తీగలగుట్టపల్లి ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన...



కరీంనగర్, జనవరి 8: (నేటినిజం ప్రతినిధి) ప్రతిమ ఫౌండేషన్ , వికాస తరంగిణి, తీగలగుట్టపల్లి 1వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రస్తుత 2వ డివిజన్ తీగల గుట్టపల్లి లోని బస్తీ దవాఖానాలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా ఆరోగ్య వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తీగలగుట్టపల్లి డివిజన్ ప్రజలు ఇట్టి ఉచిత వైద్య శిబిరానికి భారీగా తరలివచ్చి , వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత వైద్య శిబిరంలో 2డి ఎకో,ఈసీజీ,పాప్స్ మియర్,మామోగ్రఫీ అన్ని రకాల ఎక్రేలు , కళ్ళకు సంబంధించిన అన్ని వైద్య పరీక్షలను డాక్టర్లు నిర్వహించి, అవసరమైన మందులను అందించారు. మరి కొంతమందికి రోగులకు వైద్య సలహా ,సూచనలను తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్ లోని ప్రజల ఆరోగ్య రక్షణ కోసం తనవంతుగా సహకారం అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరానికి డివిజన్ ప్రజలందరూ తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు .డిప్యూటీ డి ఎం హెచ్ ఓ రాజగోపాల్ ఇట్టి ఉచితవైద్య శిబిరాన్ని సందర్శించారు.శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి వారి మంగళ శాసనములతో వికాస తరంగిణి తీగలగుట్టపల్లి శాఖ07 ఆధ్వర్యంలో ప్రతిమ ఫౌండేషన్ వారితో కలిసి నిర్వహించిన ఫ్రీ హెల్త్ క్యాంపులో చీఫ్ కోఆర్డినేటర్ అరణీ చరణ్ రావు ,పిఆర్ఓ సాదుల భాస్కర్ ఆరోగ్య వికాస్ కోఆర్డినేటర్ శ్రీమతి గోపగోనిస్వర్ణలత ప్రజ్ఞ ,కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి సంస్కార్ కోఆర్డినేటర్ అమల వికాస తరంగిణి సభ్యులు ప్రతిమ మార్కెటింగ్ మేనేజర్ కౌశిక్ ప్రతిమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డయల్ 100ను విరివిగా వినియోగించుకోవాలి

**-యువత, వృద్ధులు గంజాయికీ దూరంగా ఉండాలి**

**-అత్యవసర సమయంలో 100కు కాల్ చేయాలి**

**-పోలీస్ మీకోసం కార్యక్రమంలో 500 దుప్పట్లు పంపిణీ**

ఆదిలాబాద్, జనవరి 8:అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ఆదివాసీలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్. అన్నారు. ఈ రోజు మార్కుల కోలం ఆదివాసి గ్రామమైన పాటగూడాలో అదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పోలీస్ మికోసంఅనే కార్యక్రమంలో భాగంగా 500 దుప్పట్ల పంపిణీ చేసీ, ఆదివాసి గ్రామాలలో ప్రజలు, యువత గంజాయికి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలఅన్నారు. పోలీసులు మికోసంలో భాగంగా 500 దుప్పట్లను ఉచితంగా పంపిణీ చేశారు.

**పాల్గొన్న ఎనిమిది గ్రామాల ప్రజలు**

త్వరలోనే యువతకు జాబ్ మేళా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100 ను విరివిగా వినియో ంచుకోవాలని సూచించారు. ఎలాంటి వైద్య సమస్యలకైనా ప్రభుత్వ ప్రైవేటు, వైద్యులను సంప్రదించాలనీ, మారుమూల ఆదివాసి గ్రామ ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు మెరుగు పరచాలని ఇంద్రవెల్లి మండలం పాటగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ పోలీస్ మీ కోసం కార్యక్రమానికి పరిసర గ్రామాల ఆదివాసులు పాల్గొని విజయవంతం చేశారు.

మొదటగా జిల్లా ఎస్పీ, ఉట్నూర్ అదనపు ఎస్పీ లకు ఆదివాసీలు డప్పు వాయిద్యాల నడుమ, సాంప్రదాయాలతో స్వాగతం పలికారు. తదుపరి దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఆదివాసి ప్రజలు చదువుపై ప్రాధాన్యత కేటాయించి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలను సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.కొడుకును కూతురును ఒకే విధంగా చూస్తూ సమాన విద్య అవకాశాలను ఇస్తూ ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, ఐపీఎస్, ఉట్నూరు సిఐ ఎం ప్రసాద్, ఇంద్రవెల్లి ఎస్ఐ ఈ సాయన్న, నూతనంగా ఎంపికైన సర్పంచులు, గ్రామ పటేల్, గిరిజనులు కోలం జాతి వారు సిబ్బంది పాల్గొన్నారు.

# యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

**-రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల,జనవరి 8: నేటినిజం ప్రతినిధి): యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..గురువారం వేములవాడ పట్టణంలో రాజన్న సిరిసిల్ల జిల్లాశ్రీ కృష్ణ బలరామ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన యాదవ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మానం నిర్వహించగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు..జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.. అనంతరం సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు.ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు అభినందించారు.. ప్రజలు పలు సందర్భాల్లో ప్రశ్నించే గొంతుకలకు అవకాశం ఇస్తున్నారని అందులో భాగంగా నేడు మీరందరూ గెలిచి రావడం జరిగింది అన్నారు.నేడు జరిగే సన్మానం మీపై మరింత బాధ్యత పెంచుతుందని ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ముందుకు పోవాలని అన్నారు.. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు.. తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.. కులం ఒక బలం బలగం అని ఇతర కులాలను కలుపుతూ ముందుకు పోవాలన్నారు..మొన్నటి ఎన్నికల్లో చాలామంది బీసీ బిడ్డలు జనరల్ స్థానాల్లో ఎన్నికవ్వడం శుభ పరిణామం అన్నారు.. రాజ్యాంగ సవరణ ద్వారా రాజీవ్ గాంధీ ఢిల్లీ నుంచి నిధులు నేరుగా పల్లెల్లోకి వచ్చేలా చేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి కృషి చేశారని తెలిపారు.. గత పాలకులు ప్రజల మద్దతుతో గెలిచి మన ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించారని వేములవాడ వెనుకబాడుతనానికి కారణం అయ్యారని పేర్కొన్నారు...ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేములవాడ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు... నియోజకవర్గన్నీ అన్ని రంగాల్లో అభివృద్ధి పథం లో తీసుకెళ్తానని పేర్కొన్నారు. పట్టణంలో 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు రోడ్డు పనులు, 150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.. వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా మార్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు..యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. నా గెలుపులో సైతం యాదవులు క్రియాశీలంగా పనిచేశారన్నారు. యాదవుల సభ్యులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానాని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి సంతోష్ యాదవ్, జెకె యాదవ్, సంఘ స్వామి యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, తిరుపతి బాబు యాదవ్, సిర్రం ప్రసాద్ యాదవ్, మామిండ్ల పర్శరాములు యాదవ్, కాశవేని మహేష్, మల్లేశం, సత్తయ్య యాదవ్, జక్కుల మహేష్ యాదవ్ పాల్గొన్నారు.



# రాజకీయంగా ఎదగాలి...సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ



రాజన్న సిరిసిల్ల,జనవరి 8: నేటినిజం (ప్రతినిధి): ఆరె కులస్తులు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని అరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆరె, ఆర్య క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిలువేని మల్లేశం ఆధ్వర్యంలో జిల్లాలోని పలు గ్రామా ఆరె, ఆర్య క్షత్రియ కులానికి చెందిన వారు సర్పంచులు, ఉప సర్పంచులుగా ఎన్నికైన సందర్భంగా వేములవాడ పట్టణంలోని హరిమల గార్డెన్ లో ఘన సన్మానం గావించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో 10 లక్షలకు పైగా జనాభా కలిగి ఉండగా 8 నుండి 10 నియోజకవర్గాల్లో గెలుపును నిర్దేశించే విధమైన ఓటర్లు కలిగి ఉన్నామని చెప్పారు. గ్రామపంచాయతీ నుండి జరిగే ప్రతి ఏ ఎన్నికైన ప్రతి ఒక్కరు పోటీలో నిలుచుని రాజకీయంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. జనాభా ప్రతిపాదికన మనకు రావలసిన ప్రతి హక్కును ప్రభుత్వం ద్వారా రాబట్టుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన గ్రామాల సర్పంచులు ఇటిక్యాల రాజు, ఎంద్రాల ప్రసాద్, సాండేసారి సౌజన్య -మల్లికార్జున్, కొడేగానీ వెంకటేష్, ఇరువల సౌందర్య మహేందర్, మోహన్ రావు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులతో కలిసి 42 మందిని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షుడు సిలువేరి మల్లేశం, ప్రధాన కార్యదర్శి ఎంద్రాల అశోక్, ఉపాధ్యక్షులు సూరదేవరావు, రాష్ట్ర నాయకులు సూరారం శివాజీ, జెండా రాజేష్, మనోహర్, ఇటికాల లింగయ్య తదితరులు ఉన్నారు.

# దేశ ప్రజలందరి సంక్షేమం కోసం ప్రార్థిస్తూ సుభాషితాన్ని పంచుకున్న ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 8:సోమనాథ్ స్వాభిమాన పర్వ్ ప్రారంభం సందర్భంగా నేడు దేశ ప్రజలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. వెయ్యేళ్లుగా లక్షలాది ప్రజల హృదయాల్లో సోమనాథ్‌ను సజీవంగా నిలిపిన కాలాతీత నాగరికతా స్ఫూర్తిని ఆయన గుర్తుచేసుకున్నారు.

సోమనాథ్ 1026 సంవత్సరం జనవరిలో మొదటి దాడిని ఎదుర్కొందని శ్రీ మోదీ చెప్పారు. తర్వాతి శతాబ్దాల్లోనూ పదేపదే దాడులు జరిగినప్పటికీ.. భక్తుల అచంచలమైన విశ్వాసం, భారతీయ నాగరికతా దృఢ సంకల్పం వల్ల ప్రతీసారి సోమనాథ క్షేత్రం పునర్నిర్మితమై నిలిచింది. "సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ అంటే.. సిద్ధాంతాలు, విలువల విషయంలో ఎన్నడూ రాజీపడని అసంఖ్యాకులైన భరతమాత బిడ్డలను స్మరించుకోవడమే. పరిస్థితులు ఎంత భీకరంగా ఉన్నప్పటికీ.. వారి సంకల్పం చెక్కుచెదరలేదు. మన సంస్కృతి పట్ల వారి నిబద్ధత ఎంతమాత్రమూ సడలలేదు" అని ఆయన అన్నారు.

గతంలో తన సోమనాథ్ పర్యటనలకు సంబంధించిన మధుర స్మృతులను ప్రధానమంత్రి సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగిస్తూ ప్రజలంతా తమ జ్ఞాపకాలను పంచుకుంటూ, ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 1951లో పునర్నిర్మించిన సోమనాథ ఆలయ ద్వారాలు నాటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో తెరుచుకున్నాయి. ఆ చారిత్రక ఘట్టానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా.. 2001 అక్టోబరు 31న నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రధానమంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సోమనాథ ఆలయ పునర్నిర్మాణంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, కె.ఎం. మున్షీ, తదితర ప్రముఖులు అత్యంత కీలక పాత్ర పోషించారని వ్యాఖ్యానించారు. 2001లో ఆ కార్యక్రమం, సర్దార్ పటేల్ 125వ జయంతి వేడుకలు ఒకేసారి జరగడం విశేషం. నాటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, హోం మంత్రి లాల్ కృష్ణ అద్వానీ తోపాటు పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు.

అలాగే 1951లో సోమనాథ ఆలయాన్ని దేశానికి పునరంకితం చేసిన మహత్తర ఘట్టానికి 2026తో 75 ఏళ్లు పూర్తవుతాయని ప్రధానమంత్రి శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. "ఈ చారిత్రక ఘట్టం ఆలయ పునర్నిర్మాణానికి మాత్రమే సంబంధించింది కాదు.. తరతరాలకు స్ఫూర్తినిస్తూ కొనసాగుతున్న మన నాగరికత అజేయ స్ఫూర్తికి ఇది నిదర్శనం" అని ఆయన స్పష్టం చేశారు.

సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ నేడు ప్రారంభమవుతోంది. వెయ్యేళ్ల కిందట.. 1026 జనవరిలో సోమనాథ్ తొలి దాడిని ఎదుర్కొన్నది. 1026 దాడిగానీ, అనంతర దాడులుగానీ లక్షలాది మంది అచంచలమైన విశ్వాసాన్ని ఏమాత్రమూ సడలించ లేకపోయాయి. నాగరికతా స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేకపోయాయి. ఆ స్ఫూర్తితోనే సోమనాథ ఆలయం మళ్లీ మళ్లీ పునర్నిర్మితమై నిలిచింది.

"2001 అక్టోబర్ 31న సోమనాథ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సంబంధించిన కొన్ని జ్ఞాపకాలివి. 1951లో పునర్నిర్మించిన సోమనాథ ఆలయ ద్వారాలు.. నాటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో తెరచుకున్న మహత్తర ఘట్టానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన వేడుక అది. సర్దార్ పటేల్, కె.ఎం. మున్షీ, తదితరుల కృషి అత్యంత ప్రశంసనీయం. అదే సమయంలో సర్దార్ పటేల్ 125వ జయంతి వేడుక కూడా జరిగింది. 2001 నాటి కార్యక్రమానికి నాటి ప్రధానమంత్రి అటల్ గారు, హోంమంత్రి అద్వానీ గారు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ నేడు శుభప్రదంగా ప్రారంభమవుతోంది. వెయ్యేళ్ల కిందట.. 1026 జనవరిలో సోమనాథ మందిరం చరిత్రలో తొలి దాడిని ఎదుర్కొన్నది. 1026 దాడిగానీ, అనేక అనంతర దాడులుగానీ.. అచంచలమైన మన విశ్వాసాన్ని సడలించలేకపోయాయి. పైగా ఈ ఘటనలు భారత సాంస్కృతిక ఏకతా భావనను మరింత బలోపేతం చేశాయి. మళ్లీ మళ్లీ సోమనాథ మందిరం పునర్వైభవంతో నిలిచింది.

సిద్ధాంతాలూ, విలువల విషయంలో ఎన్నడూ రాజీపడని అసంఖ్యాకులైన భరతమాత బిడ్డలను స్మరించుకునే వేడుక. సమయమెంత కఠినంగా, భీకరంగా ఉన్నప్పటికీ.. వారి సంకల్పం ఎన్నడూ చెక్కుచెదరలేదు. మన నాగరికత, సాంస్కృతిక చేతన పట్ల వారి నిష్ఠ ఏమాత్రమూ సడలలేదు. వెయ్యేళ్ల అచంచలమైన విశ్వాసానికి ప్రతీక అయిన ఈ సందర్భం.. దేశ ఐక్యత దిశగా నిరంతరం కృషి చేసేలా మనకు స్ఫూర్తినిస్తుంది."

"2001 అక్టోబర్ 31న సోమనాథ్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి సంబంధించిన కొన్ని చిత్రాలను నేను మీతో పంచుకుంటున్నాను. 1951లో పునర్నిర్మితమైన సోమనాథ మందిర ప్రారంభానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఉత్సవమది. ఆ చారిత్రక వేడుక 1951లో నాటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో జరిగింది. సోమనాథ మందిర పునర్నిర్మాణంలో సర్దార్ పటేల్, కె.ఎం. మున్షీతోపాటు ఎందరో మహనీయుల కృషి నిజంగా అత్యంత ప్రశంసనీయం. 2001లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాటి ప్రధానమంత్రి అటల్ గారు, హోం మంత్రి అద్వానీ గారు, అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

# హిమాలయ బేబీకేర్ కొత్త డీవీసీ ఆవిష్కరణ




హైదరాబాద్, జనవరి 8: భారతదేశంలో అత్యంత నమ్మకమైన హిమాలయ బేబీకేర్ శిశువుల తొలి శీతాకాలంలో తల్లుల సహజ ఆందోళనను హృద్యంగా ప్రతిబింబించే కొత్త డిజిటల్ వీడియో కమర్షియల్ (డీవీసీ)ని ఆవిష్కరించింది. చలికాలంలో చల్లని, పొడి వాతావరణ నేపథ్యంతో రూపొందించిన ఈ ప్రచార చిత్రం తల్లిదండ్రులు తమ బిడ్డ మృదువైన చెంపలు, సున్నితమైన చర్మాన్ని ఎలా కాపాడుకుంటారో భావోద్వేగంగా చూపిస్తుంది. ఈ డిజిటల్ వీడియో కమర్షియల్లో కఠినమైన శీతాకాల గాలి తన బిడ్డ సున్నితమైన చర్మాన్ని ముఖ్యంగా ముద్దు ముద్దుగా ఉన్న చెంపలను చూస్తూ తల్లి ఆందోళనతో కథ మొదలవుతుంది. ఆ ఆందోళనకు ఆప్యాయతతో, నమ్మకంతో స్పందిస్తూ.. భయం నుంచి ధైర్యంగా వైపు మళ్ళుతుంది. చివరికి ఆమె ఒక బలమైన హామీ ఇస్తుంది. 'హమ్ హోనే హీ నహీ దేంగే' అంటే ఎంత కఠినమైన వాతావరణం అయినా తన బిడ్డ చెంపలు మృదువుగానే ఉంటాయని ఇచ్చే ఒక భరోసా. భావోద్వేగాలు, రోజు వారీ జీవితానికి దగ్గరగా సహజత్వంతో రూపొందించిన ఈ చిత్రం హిమాలయ జెంటిల్ బేబీ లోషన్, జెంటిల్ బేబీ క్రీమ్ శిశువుల కోసం శీతాకాలంలో అవసరమైన ఉత్పత్తులు అన్న విషయాన్ని మరింత బలంగా చూపిస్తుంది. చర్మానికి అనుకూలమైన పీహెచ్ 5.5తో, పెంటా మాయిశ్చర్ లాక్ ఫార్ములేషన్ శక్తితో రూపొందిన హిమాలయ జెంటిల్ బేబీ లోషన్, క్రీమ్ చలికాలంలో శిశువుల సున్నితమైన చర్మాన్ని తేమపరచి, చర్మ రక్షణ పొరను కాపాడడంలో సహాయపడుతుందని ఈ క్యాంపెయిన్ చెప్తుంది. తల్లిదండ్రులకు పిల్లలపై ఉండే ప్రేమను శాస్త్రీయ ఆధారాలతో కూడిన భరోసాతో ఈ డీవీసీ తమ బిడ్డ తొలి శీతాకాలాన్ని ఎదుర్కొంటున్న తల్లిదండ్రులకు హిమాలయ బేబీకేర్ ఒక నమ్మదగిన భాగస్వామి అనే విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తుంది.

# సీఎం కప్ టార్చ్ ర్యాలీ

మండల కేంద్రంలో ఈ రోజు సీఎం కప్ టార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్ మాట్లాడుతూ ఈ నెల 17 నుండి 22 వరకు సీఎం కప్ మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాధ, ఉపాధ్యాయ సిబ్బంది, మండల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.


## ఆహ్వానం

**తిరుపతి జిల్లా రచయితల సంఘం**



ఆర్.సి.కృష్ణస్వామిరాజు నవల

**చింతల చేను**

పుస్తక ఆవిష్కరణ



సభాధ్యక్షులు: శ్రీ తోట వెంకటేశ్వర్లు, అధ్యక్షులు, తిరసం

పుస్తక ఆవిష్కరణ: ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, పూర్వ ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం, తెలుగు శాఖాధిపతి, మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి

పుస్తక సమీక్ష: డాక్టర్ కె. శ్రీనివాసులు రెడ్డి, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు

ఆత్మీయ అతిథి: డాక్టర్ డి. మస్తానమ్మ, పూర్వ అధికారభాషా సంఘం సభ్యులు, వ్యవస్థాపక అధ్యక్షులు, శంకరంబాడి సాహితీ పీఠం

గౌరవ అతిథి: డాక్టర్ ఎన్. భీమన్న, తెలుగు శాఖాధిపతి, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి

తేది: 11-01-2026, ఆదివారం, సమయం: సా. 5.00 గం.

వేదిక: చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం, బైరాగిపట్టెడ, తిరుపతి.

సెల్: 9393662821


# అగ్నివేశ్ అగర్వాల్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసిన పీఎం

న్యూఢిల్లీ, జనవరి 8:శ్రీ అగ్నివేశ్ అగర్వాల్ మృతి పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ సంతాపం వ్యక్తం చేశారు.

"శ్రీ అగ్నివేశ్ అగర్వాల్ ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికరం, బాధాకరం. మీరు ఎంతగా బాధపడుతున్నారో, మీ పోస్టు ద్వారా తెలుస్తోంది. ఈ క్లిష్ట సమయంలో మీకు, మీ కుటుంబసభ్యులకు మనోధైర్యం కలగాలని కోరుకుంటున్నాను. ఓం శాంతి.

# ప్రభుత్వ ఖర్చుతో చేయ వలసిన పనులకు అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారు.

**-మీ సమస్య - మా బాధ్యత, కార్యక్రమం లో ప్రజల ఆవేదన**




హైదరాబాద్ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); మీ సమస్య - మా బాధ్యత, ప్రజలతో - ప్రజల కోసం తలపెట్టిన కార్యక్రమంలో భాగముగా భారత రాష్ట్ర సమితి నాయకులకు బుధవారం రోజు రాత్రి వరకూ కిజ్రా ఎంక్లైవ్, హ్యాపీ హోం కాలనీ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు వారి వారి సమస్యలు వెల్లిబుచ్చారు.మురుగు నీటి పారుదల పైపులు, త్రాగు నీళ్ల పైపు లైన్లు వగైరా ప్రజా అవసరాలు తీర్చే పనులు మొత్తంగా ప్రభుత్వ ఖర్చుతో చేయ వలసి ఉండగా కొంతమంది స్థానిక నాయకులు అధికారులకు తెలిసో తెలియకో డబ్బులు వసూలు చేస్తుండడం, డబ్బులు ఇవ్వని వారిని వేదించడం జరిగిన దరిమిలా అల్జాపూర్ రోడ్ లో డాలర్ హిల్స్ కిజ్రా కాలనీ వైపు ఉండే నివసితులకు మంచి నీటి సరఫరా లైను మురుగు నీటి సరఫరా లైన్లు వేయని కారణంగా వీటి కోసం తరచూ రోడ్డు తవ్వి అవతల పక్క నుండి కనెక్షన్ తీసుకోవలసి వస్తుందని ఆవేదక్న వ్యక్తం చేసారు.కిజ్రా కాలనీ కమాన్ మరియు పాషా కాలనీ క్రాస్ వద్ద నాణ్యత పాటించని డ్రైనేజీ లైన్ నిర్మాణం చేసిన కారణంగా ఆ ప్రాంతంలో రోడ్డు గుంతలు పడడం మరియు స్పీడ్ బ్రేకర్లు లేని కారణంగా ఈ ప్రాంతంలో తరచూ ఆక్సిడెంట్స్ జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు గురించి గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ చెవిటి వాడి ముందు శంఖం ఊది నట్లుగా ఉందన్నరు.పగలు మొత్తంగా కాయా కష్టం చేసి అలసి పోయి నిద్రావస్తలో ఉన్న అర్ధ రాత్రి సమయాన త్రాగు నీరు సరఫరా అవుతున్న దరిమిలా అవస్థల పాలు అవుతున్నామని, రాత్రి సరఫరాకు బదులు ఉదయం పెందరలే వదిలితే బాగుంటుందనీ అభిప్రాయపడ్డా రు.ప్రజలు కట్టిన టాక్స్ తో ప్రజా పనులు నిర్వహించాల్సి ఉండంగా ప్రజా పనుల కోసం నాయకులమని చెప్పుకునేవారు ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసే విధానాన్ని స్థానిక బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, కిరణ్ యాలాల, షేక్ ఆరిఫ్, సుమనళిని, బిందు, కృపాకర్, ఆశ్ఫాక్ అలీ, బాలాజీ, రఫీక్ పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**

RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com